RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక







ప్రచురణ : తెలంగాణ, సంపుటి 02, సంచిక 21, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, బుధవారం - 22 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## 'ఊపిరి ఉన్నంత వరకు..' పహల్గామ్ బాధితుల వ్యథ



పహల్గామ్: సరిగ్గా ఏడాది క్రితం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ నెత్తురోడింది. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు మతం పేరుతో 26 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్న ఆ చీకటి రోజును యావత్ దేశం ఇంకా మర్చిపోలేదు. ఆనాటి ఉగ్రదాడికి ఏప్రిల్ 22తో ఏడాది పూర్తవుతున్న తరుణంలో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. ఒకపక్క ఆత్మీయులను కోల్పోయిన ఆవేదన, మరోపక్క ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరక పోవడం వారిని మరింత కుంగదీస్తున్నాయి. మిగతా.. 2లో

## మోదీని ఉగ్రవాది అనలేదు.. నా వ్యాఖ్యలను వక్రీకరించారు




ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం స్పష్టత ఇచ్చారు. తాను ప్రధాని మోదీని 'ఉగ్రవాది' అని పిలవలేదని, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరించారు. మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నెలకొన్న భయానక వాతావరణాన్ని ఉద్దేశించే తాను ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు.

## తెలంగాణలో యువత అంతా ఏమైంది?.. 75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడా?: కేసీఆర్ సభపై కవిత సెటైర్లు




- ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్న కల్వకుంట్ల కవిత
- మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- యూత్ రాజకీయాల్లోకి రావాలంటూ జాగృతి అధ్యక్షురాలు పిలుపు
- తన పార్టీలో యువతకు ఉద్యమకారులకు పెద్దపీట వేస్తామని వ్యాఖ్య

## కూటమి నేతల ప్రకటనలు సముచితంగా లేవు చంద్రబాబుకు తెలంగాణ మంత్రి పొన్నం లేఖ

- ★ రాష్ట్ర విభజనపై కూటమి నేతల వ్యాఖ్యలు సరిగా లేవన్న పొన్నం
- ★ ఇలాంటి వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలను రగిలించే ప్రమాదం ఉందని హెచ్చరిక
- ★ రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగడం అవసరమని వ్యాఖ్య




హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల విభజన అంశం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏపీ సీఎం చంద్రబాబుకి

# రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు

- ▶▶ కరీంనగర్‌లోని రేకుర్తి చెరువు సుందరీకరణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన
- ▶▶ 3 చెరువుల పునరుజ్జీవం కోసం 5 కోట్ల 82 లక్షల రూపాయల నిధులను కేంద్రం మంజూరు
- ▶▶ రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ లో గుంతలు పడ్డ అన్ని గల్లీల్లో రోడ్లను నిర్మిస్తాం.
- ▶▶ మోటార్ల కొనుగోలులోనే పెద్ద అవినీతి చేశారు
- ▶▶ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్ దే.



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహువు అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేతువు అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. నువ్వు చావాలంటే నువ్వు చావాలంటూ ఒకరికొకరు పైకి తిట్టుకుంటూ ఇద్దరూ కలిసి తెలంగాణ ప్రజలను చంపుకుతింటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం సహా కేసీఆర్ కుటుంబం చేసిన అవినితిని కప్పిపుచ్చేందుకు రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. కరీంనగర్‌లోని రేకుర్తి చెరువు సుందరీకరణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల రమేశ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి తదితరులతో మీడియాతో రేవంత్ రెడ్డి, కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ..'కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా అమృత్- 2 పథకంలో భాగంగా 3 చెరువుల పునరుజ్జీవం కోసం 5 కోట్ల 82 లక్షల రూపాయల నిధులను కేంద్రం మంజూరు చేసింది. మిగతా.. 2లో

## కేసీఆర్ ఆదేశాల మేరకే ఢిల్లీకి వెళ్లాను.. కానీ!: హరీశ్ రావు

- తన ఢిల్లీ పర్యటనపై రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని విమర్శ
- విషయం ఉన్నవారు ఎవరూ ఇలాంటి పనులు చేయరన్న హరీశ్ రావు
- రేపు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ ఉందని వెల్లడి




## తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త




## రేవంత్ రెడ్డి మొదటి నుంచి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ - జీవన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు




- 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో ఓటుకు నోటు కేసులో దొరికిపోయారని ఆరోపణ
- మేం పాలన మార్పు కోరుకుంటున్నాం కానీ రేవంత్ రెడ్డికి కీడు జరగాలని కోరుకోవడం లేదని వ్యాఖ్య

## అంబటి రాంబాబుపై మరో కేసు నమోదు




- అంబటిపై కేసు నమోదు చేసిన నగరంపాలెం పోలీసులు
- అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశంలో దీక్ష నిర్వహించారంటూ కేసు
- ఇప్పటికే రెండు కేసుల్లో 17 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్న అంబటి

# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం

## తమిళనాడులో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

- చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి మీడియా సమావేశం
- డీలిమిటేషన్‌పై డీఎంకే, కాంగ్రెస్ తీరును ఎండగట్టిన చంద్రబాబు
- మహిళా రిజర్వేషన్లను అడ్డుకుని దక్షిణాదికి నష్టం చేశారని ఆవేదన
- మాతృభాషను గౌరవిద్దాం.. ఇతర భాషలపై ద్వేషం వద్దని హితవు



అమరావతి: అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల కల్పన జరగాలంటే అది ఒక్క ఎన్డీఏతోనే సాధ్యమని, తమిళనాడు రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురాగల శక్తి ఎన్డీఏ కూటమికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందో వివరించారు.

రాహుల్, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని చంద్రబాబు ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని డీఎంకే, కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు భావిస్తున్నాయి. కానీ వాస్తవానికి వారు ఈ దేశ మహిళలను, దక్షిణాది రాష్ట్రాలను ఓడించారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం పెంచాలనేది కేంద్రం ప్రతిపాదన. ఆ పెరిగిన సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయి. దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. మిగతా.. 2లో

## ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది




- ❖ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను టీడీపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్న జగన్
- ❖ గత రెండేళ్లుగా ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రం వెనకబాటులో ఉందని వెల్లడి
- ❖ ఉపాధి హామీ వ్యయం, పనిచేసిన కుటుంబాల సంఖ్య తగ్గాయని ఆరోపణ
- ❖ అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శ

## ఏపీలో ఉద్యోగుల స్థానికతపై కొత్త రూల్స్.. అమల్లోకి రాష్ట్రపతి ఉత్తర్వులు




- ➤ 1975 నాటి ఉత్తర్వుల స్థానంలో 2025 పేరుతో కొత్త నిబంధనలు
- ➤ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 95 శాతం పోస్టులు స్థానికులకే రిజర్వ్
- ➤ 26 జిల్లాల ప్రాతిపదికన జిల్లా, జోనల్, మల్టీ-జోనల్ కేడర్ల పునర్వ్యవస్థీకరణ
- ➤ కేడర్ల మార్పు ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి 27 నెలల గడువు

## మోదీని ఉగ్రవాది అనలేదు.. నా వ్యాఖ్యలను వక్రీకరించారు

మొదటి పేజి తరువాయి

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నెలకొన్న భయానక వాతావరణాన్ని ఉద్దేశించే తాను ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు. "మోదీ ఉగ్రవాది అని నేను అనలేదు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, సంస్థలను, ఏజెన్సీలను బెదిరించడానికి వాడుకుంటున్నారని చెప్పాను" అని ఖర్గే స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలతో సహా కీలకమైన వ్యవస్థలన్నీ రాజకీయ ఒత్తిడిలో పనిచేస్తున్నాయని, ఇది ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం (ఈసీ) కూడా స్వతంత్రంగా వ్యవహరించడం లేదని, బీజేపీకి అనుబంధ కార్యాలయంలా మారిపోయిందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు ఎప్పుడూ మద్దతు ఇస్తోందని పునరుద్ఘాటించారు. అయితే, ఈ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాము బిల్లును కాదని, డీలిమిటేషన్‌ను తీసుకురావడాన్ని మాత్రమే వ్యతిరేకించామని తెలిపారు. ధనబలం, కండబలం, దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో యువత అంతా ఏమైంది?.. 75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడా?: కేసీఆర్ సభపై కవిత సెటైర్లు

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచేందుకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రస్థానానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా కొత్త రాజకీయ పార్టీని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. తన కొత్త పార్టీలో యువతకు, తెలంగాణ ఉద్యమకారులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై, ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగిత్యాలలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ సభలో సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆ పార్టీలో చేరారు. ఈ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కవిత తీవ్రంగా తప్పుబట్టారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని పార్టీలో చేర్చుకుని, ఆయనకు 25 ఏళ్లు తగ్గిపోయాయని, నవ యువకుడిగా అద్భుతాలు చేస్తారని కేసీఆర్ పొగడటం హాస్యాస్పదమన్నారు. అలాంటప్పుడు రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువకులు ఏమవ్వాలని ఆమె ప్రశ్నించారు. యువత ఆకాంక్షలను గుర్తించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పచ్చి తెలంగాణ వ్యతిరేకి అయిన జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకుని, తెలంగాణ పునర్నిర్మాణం గురించి మాట్లాడటం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉట్టి కథలు చెబుతుంటే, అధికార కాంగ్రెస్ పార్టీ పిట్ట కథలు చెబుతోందని, కానీ ఏ ఒక్కరూ ప్రజల కష్టాల గురించి మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి వారిని తప్పుబట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ సభలో బీజేపీని పల్లెత్తు మాట అనలేదని, మహిళా రిజర్వేషన్ల ఊసే ఎత్తలేదని ఆమె మండిపడ్డారు. రాజకీయ పునరేకీకరణ పేరుతో ఆ పార్టీ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు. కొత్త పార్టీ ప్రకటన నేపథ్యంలో నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు సహకరించాలని, అడ్డంకులు సృష్టించవద్దని కవిత కోరారు. ప్రజాస్వామ్యంలో కొత్త శక్తులు ఎదిగేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో తమ సమస్యల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు కవిత తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ప్రజల గొంతుకగా నిలిచేందుకే తాను నూతన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

## కూటమి నేతల ప్రకటనలు సముచితంగా లేవు చంద్రబాబుకు తెలంగాణ మంత్రి పొన్నం లేఖ

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల విభజన అంశం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏపీ సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. రాష్ట్ర విభజనపై ఇటీవల కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని లేఖలో పొన్నం ఆందోళన వ్యక్తం చేశారు. విభజనను తప్పుబడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు చేస్తున్న ప్రకటనలు సముచితంగా లేవని... ఇవి ప్రజల మధ్య విద్వేషాలను రగిలించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా, లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై చేసిన వ్యాఖ్యలను పొన్నం ప్రభాకర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చంద్రబాబు చొరవ తీసుకోవాలని, ఈ మేరకు స్పీకర్‌కు లేఖ రాయాలని కోరారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, తన మిత్రపక్ష నేతలకు సర్దిచెప్పి ఇలాంటి సున్నితమైన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూడాలని అన్నారు. రాష్ట్రం విడిపోయి దశాబ్ద కాలం గడిచినా, ఇంకా పాత గాయాలను రేపేలా మాట్లాడటం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని మంత్రి స్పష్టం చేశారు. "రెండు రాష్ట్రాలు పాత విభేదాలను పక్కనపెట్టి, పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం" అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు తన వినతిని అర్థం చేసుకుని, సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## కేసీఆర్ ఆదేశాల మేరకే ఢిల్లీకి వెళ్లాను.. కానీ!: హరీశ్ రావు

హైదరాబాద్: తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను ఢిల్లీకి వెళ్లానని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయన చెప్పిన పని కోసమే తాను, వినోద్ కుమార్ తదితరులం వెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రి పెట్టే అక్రమ కేసులను ఎదుర్కోవడానికి, కాళేశ్వరం కేసులపై ఢిల్లీకి వెళ్లి లాయర్లతో చర్చించినట్లు చెప్పారు. కానీ తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని, మీడియా వాళ్లతో అర్థం లేని బ్రేకింగ్‌లు పెట్టించారని ఆరోపించారు. విషయం ఉన్న వారు ఎవరైనా ఇలాంటి పనులు చేయరని, విషయం లేనివారే ఇలా చేస్తారని విమర్శించారు.

నేడు ఓటుకు నోటు కేసు విచారణ

నేడు ఓటుకు నోటు కేసు కూడా సుప్రీంకోర్టులో విచారణకు రానుందని, ఆ కేసు గురించి న్యాయవాదులతో చర్చించామని అన్నారు. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరపున అనామక లాయర్‌ను పెట్టారని విమర్శించారు. నిందితుల తరపున మాత్రం ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారని చెప్పారు. రేపటి విచారణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముద్దాయిగా ఉన్నారని గుర్తు చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో, ఉదయం బీజేపీ వారితో తిరిగారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిన్న బయటకు వచ్చినందనే రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారని అన్నారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సొమ్మును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి, తమ పార్టీ అధినేత కేసీఆర్ స్థాయి ఏమిటో తెలంగాణ ప్రజలకు నిన్నటి బహిరంగ సభలతో అర్థమైందని అన్నారు. కేసీఆర్ జగిత్యాల సభ ప్రసంగాన్ని 36 లక్షలమంది చూస్తే, రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కేవలం 4 లక్షలమంది మాత్రమే చూశారని అన్నారు. రేవంత్ రెడ్డి తెలిసి చేశారో లేక తెలియక చేశారో కానీ కేసీఆర్ సభ సమయంలోనే రేవంత్ రెడ్డి తన సభను ఏర్పాటు చేసుకోవడంతో ఎవరి రేటింగ్ ఏమిటో తెలిసిందని అన్నారు.

## తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ప్రభుత్వోద్యోగుల బదిలీలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలో మే ఒకటో తేదీ నుంచి 31 వరకు ఉద్యోగుల బదిలీకి అనుమతి ఇచ్చింది. ఒకచోట మూడేళ్లు దాటిన వారు బదిలీ కావడానికి అనుమతిని మంజూరు చేసింది. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియపై సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ఫైల్‌పై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెల్లడించింది. ఇక, 2024లో చివరిసారిగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరిగాయి.

## రేవంత్ రెడ్డి మొదటి నుంచి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ - జీవన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారిపోయారని నిన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి విమర్శించారు. ఆయన మొదటి నుంచి సీమాంధ్ర నాయకుల చేతిలో కీలుబొమ్మగానే ఉంటున్నారని అన్నారు. 2015లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో, వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలనే ఉద్దేశంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి దొరికిపోయారని పేర్కొన్నారు. ఆయనకు రాజ్యాంగం పట్ల గౌరవం లేదని విమర్శించారు. ఆయన ఆంధ్రా తొత్తులా మారి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలన పోయి కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మేం పాలన మార్పు కోరుకున్నాం తప్ప, భౌతికంగా రేవంత్ రెడ్డి కీడును తాము కోరుకోలేదని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేసీఆర్ పుణ్యమే అన్నారు. కేసీఆర్ ఉద్యమించకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అలాంటి ఉద్యమనాయకుడిని పట్టుకుని ఉరితీస్తానని అంటావా అని ప్రశ్నించారు. జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సమయంలోనే రేవంత్ రెడ్డి కావాలని మేడిగడ్డ పర్యటనను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని, కానీ రేవంత్ రెడ్డి తానే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారని... ఎన్డీఏకు, రేవంత్ రెడ్డికి మధ్య చంద్రబాబు వారధిగా ఉన్నారని అన్నారు. తనను చంద్రబాబు కాపాడుతారని ఆయన భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడంలేదని అన్నారు. నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి తెలియకుండా మాట్లాడుతున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. తనను ఎవరూ తొలగించలేదని, తనంతట తానే రాజీనామా చేశానని అన్నారు. తనతో పాటు ఇందిరాగాంధీ, కాంగ్రెస్ సహా అందరూ నాదెండ్లకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదేమో అని విమర్శించారు.

# 'ఊపిరి ఉన్నంత వరకు..' పహల్గామ్ బాధితుల వ్యథ

మొదటి పేజి తరువాయి

ఆనాటి ఉగ్రదాడికి ఏప్రిల్ 22తో ఏడాది పూర్తవుతున్న తరుణంలో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. ఒకపక్క ఆత్మీయులను కోల్పోయిన ఆవేదన, మరోపక్క ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరక పోవడం వారిని మరింత కుంగదీస్తున్నాయి.

ఆఖరి శ్వాస వరకు వెంటాడే పీడకల

పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కౌస్తుభ్ గన్‌బోటే భార్య సంగీత మాట్లాడుతూ.. ఆ భయానక ఘటనను తన ఆఖరి శ్వాస వరకు మర్చిపోలేనని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులను చంపడం ద్వారా ఉగ్రవాదులు సాధించేదేమీ లేదని, ప్రభుత్వంతో పోరాటం ఉంటే నేరుగా వారితోనే తేల్చుకోవాలని ఆమె హితవు పలికారు. మరో బాధితురాలు ప్రియదర్శిని ఆచార్య (ప్రశాంత కుమార్ శత్పథి భార్య) తన భర్త లేని లోటును ప్రతీ రోజు తలచుకుంటున్నానని, ఇంటికి పెద్దదిక్కును కోల్పోయి, ప్రస్తుతం తాత్కాలిక ఉద్యోగంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని కన్నీటి



పర్యంతమయ్యారు. ఆర్థిక సాయం అందినప్పటికీ, ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగం మాత్రం ఇంకా రాలేదని, ఆ మాట నిలబెట్టుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

'ఆపరేషన్ సిందూర్' పేరిట..

ఏప్రిల్ 22, 2025న పహల్గామ్‌లోకి ప్రవేశించిన ఉగ్రవాదులు బాధితుల మతం అడిగి మరీ దారుణ మారణకాండకు ఒడిగట్టారు. ఈ మారణహోమానికి ప్రతీకారంగా భారత సాయుధ బలగాలు మే 7, 2025న 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్ గడ్డపైకి చొచ్చుకెళ్లాయి. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లష్కరే తొయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన తొమ్మిది భారీ ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్‌లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. తీవ్ర నష్టం వాటిల్లడంతో దిగివచ్చిన పాక్ ఆర్మీ.. భారత డీజీఎంఓను ఆశ్రయించి మే 10న కాల్పుల విరమణకు ఒప్పందం చేసుకుంది.

భయాలు వీడి.. మళ్లీ పర్యాటకుల రాక

కశ్మీర్ లోయలో ఇప్పుడు అనూహ్య మార్పు కనిపిస్తోంది. పహల్గామ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు పర్యాటకుల రాక గణనీయంగా పెరిగింది. ఇది సందర్శకుల్లో తిరిగి చిగురించిన భద్రతా భావానికి అద్దం పడుతోంది. శ్రీనగర్‌ను సందర్శించిన విశాల్ అనే పర్యాటకుడు మాట్లాడుతూ.. గతంలో జరిగిన దురదృష్టకర ఘటనల ఆధారంగా ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయలేమని, కశ్మీర్ ఇప్పుడు అత్యంత సురక్షితమైన ప్రాంతమని, ఇక్కడి ప్రజలు ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నారని పేర్కొన్నారు.

# రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు

మొదటి పేజి తరువాయి

'కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా అమృత్- 2 పథకంలో భాగంగా 3 చెరువుల పునరుజ్జీవం కోసం 5 కోట్ల 82 లక్షల రూపాయల నిధులను కేంద్రం మంజూరు చేసింది. అందులో భాగంగా 1 కోటి 98 లక్షల రూపాయలతో ఈరోజు రేకుర్తి చెరువు పునరుజ్జీవ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. డ్రైనేజీ నీరు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు రేకుర్తి చెరువును అందంగా తీర్చిదిద్ది కరీంనగర్ ప్రజలు కుటుంబాలతో కలిసి వచ్చి సేద తీరేలా మినీ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా. దీంతోపాటు కరీంనగర్ గల్లీలోని రోడ్లను నిర్మించాలని నిర్ణయించాం. రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ లో గుంతలు పడ్డ అన్ని గల్లీల్లో రోడ్లను నిర్మిస్తాం.

రేవంత్ రాహువు.. కేసీఆర్ కేతువు..

ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. నువ్వు చావాలని ఒకరు, నేను చావాలని కోరుకుంటావా? అని ఇంకొకరు చావుల గురించి మాట్లాడుకుంటున్నారు. నిజానికి వీళ్లిద్దరూ కలిసి తెలంగాణ ప్రజలను సంపుకొనితింటున్నారు. కాళేశ్వరం విషయంలో లక్ష కోట్ల రూపాయల స్కాం జరిగిందని గత ఎన్నికల్లో పదేపదే చెప్పిన రేవంత్ రెడ్డి.. సీఎం అయ్యాక అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీ అక్రమాలపైనే విచారణ జరపాలని సీబీఐకి లేఖ రాశారు. నిజానికి వాటి విలువ రూ.9 వేల కోట్లు మాత్రమే. డిజైన్ లోపాలవల్లే ఆయా బ్యారేజీలు



డ్యామేజీ అయ్యాయని అందరికీ తెలుసు. అయినా లక్ష కోట్ల ధనం వృథాపైనా, అవినీతిపైన సీబీఐ విచారణ జరపాలని ఎందుకు కోరడం లేదు? కేసీఆర్ కుటుంబాన్ని కాపాడటానికే రేవంత్ రెడ్డి చాలా తెలివిగా 9 వేల కోట్లపైనే విచారణ జరపాలని సీబీఐ లేఖ రాస్తున్నారు. మోటార్ల కొనుగోలులోనే పెద్ద అవినీతి చేశారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి వ్యవహారంపై కాళేశ్వరం విషయంలో వీళ్లు ఆడుతున్న డ్రామాలపై తెలంగాణ ప్రజలకు త్వరలోనే లేఖ రాస్తాం. జీవన్ రెడ్డి విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద విధానాలను పాటిస్తోంది. జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకోవడం ఇష్టం లేక అలిగి ఢిల్లీ పోయారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. వాళ్లే బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు కోసం పోయారని అంటున్నారు. అన్నీ అబద్దాలే. బీఆర్ఎస్ తో బీజేపీ పొత్తే ఉండదు. బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్ దే. భవిష్యత్తులో జరిగేది కూడా అదే. బీజేపీ ఎన్నడూ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలొస్తే బీజేపీ గెలుస్తుంది. తన సీటు ఖాళీ అవుతుందనే భయంతోనే రేవంత్ రెడ్డి ఏకంగా రాహుల్ గాంధీ సీటుకు ఎసరు పెట్టారు. తెలంగాణలో బీజేపీ గెలిచే అవకాశాల్లేవని జీవన్ రెడ్డి అన్నంత మాత్రాన నిజం కాబోదు. ఆ మాటకొస్తే నిజామాబాద్ లో ఎవరు గెలిచారు. తెలంగాణలో 8 ఎంపీ సీట్లు బీజేపీ గెలుచుకుంది.

తేజస్వీ సూర్య కామెంట్స్‌పై..

తేజస్వీ సూర్య వ్యాఖ్యలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వక్రీకరించాయి. తెలంగాణ ఉద్యమకారులను దేశ భక్తులతో పోల్చారని తేజస్వీ నాతో చెప్పారు. దేశ విభజన సమయంలో కాంగ్రెస్, బ్రిటీషర్ల విధానాల వల్ల లక్షలాది మంది చనిపోయారు. తెలంగాణ విషయంలోనూ కాంగ్రెస్ చేసిన తప్పిదాల వల్ల 1400 మంది బలిదానమయ్యారని తేజస్వీ చెప్పారు. ఈ విషయాన్ని వక్రీకరించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. నిజానికి పార్లమెంట్ లో కాంగ్రెస్ ఎంపీలే తెలంగాణ బిల్లును వ్యతిరేకిస్తే.. అడ్డుకుని తెలంగాణ బిల్లును ఆమోదించి సుష్మాస్వరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీలే కదా. ఆనాడు సోనియాగాంధీని బలిదేవత అని రేవంత్ రెడ్డే చెప్పారు కదా. అట్లాంటి వ్యక్తి కేబినెట్ లో మంత్రులుగా ఉన్న వాళ్లు బీజేపీని విమర్శించడం హాస్యాస్పదం అంటూ వ్యాఖ్యలు చేశారు.

# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం

మొదటి పేజి తరువాయి

దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. ఈ ఫార్ములా కంటే మెరుగైనది మరొకటి ఉంటుందా? అయినా, కేవలం రాజకీయ కారణాలతో ఈ రెండు బిల్లులను అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?" అని చంద్రబాబు ప్రశ్నించారు. "సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు ఆలోచిస్తాను? నేను దక్షిణాది వైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే, అది దక్షిణాదికి నష్టమని చెప్పి నేనే ఆపించాను. ఈ విషయాన్ని ఇండియా కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

తమిళనాడుకు గత వైభవమేదీ?

ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉన్న చెన్నై, ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడలేకపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "తమిళనాడులో అభివృద్ధి ఆగిపోయింది. శాంతిభద్రతలు క్షీణించాయి. మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ వాడకం పెరిగిపోయాయి. గతంలో తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా?



జరిగిన కొద్దిపాటి అభివృద్ధి కూడా కేంద్ర నిధుల వల్లే. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, చెన్నై-బెంగళూరు-అమరావతి హైస్పీడ్ రైలు కారిడార్ వంటివి కేంద్రం చొరవే. డీఎంకే లాంటి పార్టీల వల్ల రాష్ట్రం వెనుకబడుతోంది" అని విమర్శించారు.

ఇప్పుడు ఏపీని చూడండి

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి పథంలో పయనిస్తోందో చంద్రబాబు వివరించారు. "దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. డబ్బులు లేకున్నా, ల్యాండ్ పూలింగ్ వంటి వినూత్న పద్ధతిలో రాజధాని నిర్మిస్తున్నాం. ఇదంతా కేంద్రం సహకారంతోనే సాధ్యమైంది. తమిళనాడులోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

భాషా రాజకీయాలు వద్దు

ప్రధాని మోదీపై వ్యతిరేకతతో భాషాపరమైన బేధాలు సృష్టించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. "మాతృభాషను గౌరవించాలి, కానీ ఇతర భాషలపై ద్వేషం వద్దు. హిందీని కేంద్రం జాతీయ భాషగా ప్రకటించలేదు. ప్రధాని మోదీ సైతం మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని చెబుతున్నారు. భాష పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు" అని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా తమిళనాడు నీటి కష్టాలు తీరతాయని, అది ఎన్డీఏతోనే సాధ్యమని తెలిపారు. తిరువళ్లువార్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎందరో మహనీయులు పుట్టిన ఈ గడ్డపై ప్రజలు పురోగామి ఆలోచనలతో ఎన్డీఏకు మద్దతివ్వాలని కోరారు.

## అంబటి రాంబాబుపై మరో కేసు నమోదు



అమరావతి: వైఎస్సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. సత్తెనపల్లి లక్కీడ్రా, ముఖ్యమంత్రి చంద్రబాబుపై వ్యాఖ్యల కేసుల నుంచి ఇప్పుడిప్పుడే కొంత రిలాక్స్ అవుతున్న ఆయనపై మరో కొత్త కేసు నమోదైంది. కేసు వివరాల్లోకి వెళితే... తన ఇంటిపై జరిగిన దాడికి నిరసనగా, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన గుంటూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షే ఇప్పుడు ఆయనపై మరో కేసు నమోదుకు దారితీసింది. ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశంలో దీక్ష నిర్వహించడమే కాకుండా, తద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలతో నగరంపాలెం పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే సత్తెనపల్లి లక్కీడ్రా ఉదంతం, చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసుల్లో అంబటి రాంబాబు 17 రోజుల పాటు రిమాండ్‌లో ఉండి, బెయిల్‌పై విడుదలయ్యారు. బయటకు వచ్చిన కొన్ని రోజులకే నిరసన దీక్ష పేరిట నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆయనపై మళ్లీ కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొత్త కేసు నమోదు కావడంపై అంబటి ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## ఏపీలో ఉద్యోగుల స్థానికతపై కొత్త రూల్స్.. అమల్లోకి రాష్ట్రపతి ఉత్తర్వులు




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్లు, నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. 1975 నాటి పాత విధానాన్ని రద్దు చేస్తూ, "ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్, 2025" పేరుతో జారీ అయిన కొత్త రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 26 జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త ఉత్తర్వుల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగాల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 95 శాతం పోస్టులను స్థానిక అభ్యర్థులకే రిజర్వ్ చేయనున్నారు. జిల్లా, జోనల్, మల్టీ-జోనల్ కేడర్ పోస్టులకు ఈ నిబంధన వర్తిస్తుంది. "స్థానిక అభ్యర్థి" నిర్వచనాన్ని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. సంబంధిత అర్హత పరీక్షకు హాజరైన విద్యా సంవత్సరంతో ముగిసేలా, వరుసగా నాలుగు విద్యా సంవత్సరాలు స్థానిక ప్రాంతంలోని విద్యాసంస్థలో చదివిన వారిని లోకల్ అభ్యర్థిగా పరిగణిస్తారు. కొత్త విధానం ప్రకారం కేడర్లను మూడు స్థాయిలుగా వర్గీకరించారు. జూనియర్ అసిస్టెంట్, తత్సమాన స్థాయి పోస్టులను జిల్లా కేడర్‌గా, ఆపై సూపరింటెండెంట్, ఫస్ట్-లెవల్ గెజిటెడ్ స్థాయి పోస్టులను జోనల్ కేడర్‌గా, డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు ఉన్న పోస్టులను మల్టీ-జోనల్ కేడర్‌గా నిర్ధారించారు. ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ సివిల్ పోస్టులను స్థానిక కేడర్లుగా విభజించే ప్రక్రియను 27 నెలల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ అయ్యాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి కింద ఈ కొత్త ఉత్తర్వులను అమలు చేస్తున్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది



అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడంలో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. చారిత్రకంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉండేదని, కానీ గత రెండేళ్ల టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శించారు. ఆమోదించిన లేబర్ బడ్జెట్, పథకం కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య, మొత్తం వ్యయం వంటి అన్ని కొలమానాల్లోనూ పనితీరు గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. ఈ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని జగన్ తెలిపారు. గత రెండేళ్లుగా జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు మందగించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. "టీడీపీ కూటమి ప్రభుత్వం అవినీతి, సంపదపై ఉన్న యావతోనే నిమగ్నమై ఉంది. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టే సమయం వారికి లేదు" అని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మార్చుకొని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నార్వే ప్రతినిధుల మంత్రి శ్రీధర్ బాబు భేటీ



హైదరాబాద్: లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేలా నార్వే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని కోరారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం ఆ దేశ రాయబారి మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. 'తెలంగాణ - నార్వే' దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించింది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలను, ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, అవకాశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్లీన్ ఎనర్జీ, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఆఫ్‌షోర్ విండ్, క్లైమేట్ ఇన్నోవేషన్, గ్రీన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థలలో 'నార్వే' గ్లోబల్ లీడర్ గా కొనసాగుతోందని కొనియాడారు. ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్, డీప్ టెక్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పబ్లిక్ సర్వీసెస్, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, ఇండస్ట్రియల్ డీ కార్బనైజేషన్, గ్రీన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ హెల్త్, బయోటెక్, మెడికల్ డివైజెస్ తదితర అంశాల్లో కలిసి పని చేసేందుకు గల అవకాశాలపై 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేసుకుని ముందుకెళ్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'తెలంగాణ - నార్వే వర్కింగ్ గ్రూప్'ను ఏర్పాటు చేద్దామని మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగుపడేలా అడుగు ముందుకేస్తాం. వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం' అని నార్వే రాయబారి మే ఎలిన్ స్టెనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నార్వే ఇన్నోవేషన్ హెడ్ బ్యోర్న్ ఐవర్సన్, ఫస్ట్ సెక్రటరీ సిల్జె క్రిస్టీన్ ఆండర్సన్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సిరి వెసెత్ మెలింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో భాగస్వాములమవుదాం

**డి రవిప్రసాద్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు**



వనపర్తి జిల్లా నేటి శుభోదయ:సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇది ఒక్కరో ఇద్దరో వళ్ళ అయ్యేది కాదని ఏదైనా ప్రశ్నించే తత్వం ప్రతి ఒక్కరూ అవలంబించుకోవాలని, అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదనే చందంగా ఉంది ప్రస్తుత సమాజం. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు పుట్టుకు రావాలని అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎక్కడ చూసినా అవినీతి, ఎటుచూసిన స్వార్థ రాజకీయాలు కాబట్టి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు అబ్దుల్ రహీం వనపర్తి జిల్లా అధ్యక్షులుగా డి రవిప్రసాద్ పై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన అబ్దుల్ రహీం సార్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ బాధ్యతతో సమాజ శ్రేయస్సు కోసం ముందుకు సాగుతామని చట్టాలపై అవగాహన కల్పించే క్రమంలో అడుగులు ముందుకు వేస్తామని త్వరలోనే మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా మీడియాతో ఒక ప్రకటనలో అధ్యక్షులు డి రవి ప్రసాద్ అన్నారు.

## వయస్సు చిన్నది ఆలోచన చాలా పెద్దది!

**(రాగి అంబలి)పంపిణీ చేసిన తిరుమణి సాన్విత్ గౌడ్**

**-వెల్జాల్ చలివేంద్రం దగ్గర రాగి అంబలి పంపిణి**

నేటిశుభోదయ: తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ తిరుమణి పాండే గౌడ్ మనవడు సాన్విత్ గౌడ్ ఆధ్వర్యంలో వేసవి కాలం ప్రజల దాహార్తి తీర్చడానికి బాటసారిలకు వాహనం దారులకు రాగి అంబలి పంపిణి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సాన్విత్ గౌడ్ మాట్లాడుతూ.... వెల్జాల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన రాఘవేంద్ర గౌడ్ మా బాబాయ్ కి ప్రత్యేక ధన్యవాదాలు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దహర్తిని తీర్చడానికి నా పాకెట్ మనీ డబ్బులతో రాగి అంబలి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామంలోని ఎస్ బి ఐ బ్యాంకు దగ్గరికి వచ్చిన ప్రజలు చల్లటి నీరు,మాజ్జిగా,అంబలి తాగి వారి దాహార్తిని తీర్చుకుంటున్నారు. గ్రామంలో గెలిచిన ఓడిన ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి కుమార్ గౌడ్,కుమ్మరి రవి,రాము,రాఘవేందర్,సాయిలు,పృథ్వి,తదితరులు పాల్గొన్నారు.



## బందారం టు దర్గా బీటీ రోడ్డుకు శంకుస్థాపన, అభివృద్ధికి చిరునామా కాంగ్రెస్ పార్టీ : డిసిసి అధ్యక్షురాలు



గజ్వేల్ నియోజకవర్గ, 21 ఏప్రిల్ 2026 : నేటి శుభోదయ :సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. మంగళవారం బందారం గ్రామం నుండి దర్గా వరకు దాదాపు 3 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ కొలుపుల గంగాధర్ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పనులు ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధికి చిరునామా అని కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. బందారం టు దర్గా రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొండపాక మండల మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ పొట్ట పరశురాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు, తిమ్మారెడ్డి పల్లె సర్పంచ్ కొయ్యడ వెంకటేష్, దర్గా సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు. అలాగే నాయకులు సురేందర్రావు, కనక రాములు, మాజీ సర్పంచులు నిమ్మ దుర్గారెడ్డి, పాలడుగు చంద్రారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగుల వెంకటేష్, గంగుల రాజు, కొలుపుల కనకవ్వ, నీలా హైమావతి, సీనియర్ నాయకులు తోట మాధవరెడ్డి, గంగుల అనిల్, రామ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కామిరెడ్డి నరసింహారెడ్డి, పెద్ద అంకుల్ శ్రీకాంత్, మెరుగు రాజు, గంగుల మల్లేశం, రాగళ్ల రాజు, బట్ట యాదగిరి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గజ్వేల్ లో ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు



గజ్వేల్, 21 ఏప్రిల్ 2026 : నేటి శుభోదయ: గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు మంగళవారం స్థానిక సీతారామ - ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, ఆదిశంకరాచార్య ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకం, పుష్పార్చన, మంగళహారతి మరియు మంత్రపుష్పం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు, అద్వైత సిద్ధాంత ప్రచారానికి ఆదిశంకరాచార్యులు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన



చూపిన మార్గం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు దేశపతి శంకర్ శర్మ, కార్యదర్శి రవీందర్రావు, కోశాధికారి కృష్ణమూర్తి శర్మ, చాడ నందబాలశర్మ, ఉపాధ్యక్షుడు రాయారావు విశ్వేశ్వర్ రావు పాల్గొన్నారు. వారితో పాటు బెజుగామ నాగేందర్రావు, దేవునూరీ రాజేశ్వర్, యేగీశ్వర మురళిశర్మ, అమరవాది నీరంజన శర్మ, ఆదిరాజుపల్లె శ్రీనివాస్ శర్మ మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21,( నేటి శుభోదయ), జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దారు లు, ఎంపీడీవో లు, ఏటీఎంలు మరియు సంబంధిత శాఖల అధికారుల తో టెలికాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు 83,635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56 కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరిందని, ముఖ్యంగా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో అధికంగా ధాన్యం వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం గ్రేడింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు .రైస్ మిల్లర్ల నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించడంతో పాటు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు..నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని, కూలీలు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని పిలుపునిచ్చారు. ధాన్యాన్ని తాలు, తడి లేకుండా శుభ్రంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, మిల్లుల కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## కాంకేర్ జిల్లా యస్ పి ముందు లొంగిపోయిన ఉత్తర భస్తర్ డివిజన్ కమిటీ మేంబర్



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: నక్సల్ నిర్మూలన ప్రచారంలో కాంకేర్ పోలీసులు మరో కీలక విజయాన్ని సాధించారు. హింసా మార్గాన్ని వీడి సమాజ ప్రధాన స్రవంతిలో చేరాలని ఉత్తర బస్తర్ డివిజన్ కమిటీ (పిఎల్‌జిఎ కంపెనీ నెం. 05) పిపిసిఎం దర్సు షోరి హింసా మార్గాన్ని విడిచిపెట్టి సమాజ ప్రధాన స్రవంతిలో చేరాలని నిర్ణయించుకున్నారు. రూ. 8 లక్షల బహుమతిగా ప్రకటించబడిన దర్సు షోరి, ఏకే-47 రైఫిల్‌తో మంగళవారం పోలీసు సూపరింటెండెంట్ నిఖిల్ రాఖేచాకు లొంగిపోయారు. హింసను,విడిచిపెట్టాలనుకునే వారికి పునరావాస ద్వారాలు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, అయితే అశాంతిని వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు ఉంటాయని బస్తర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పి. ఈ నిర్ణయం స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని స్వాగతించారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రభావితమైన ఇతర కేడర్‌లను ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను ఇప్పుడు ముమ్మరం చేశారు.

## గజ్వేల్ ఘనంగా శ్రీ సరస్వతి శిశు మందిర్ వార్షికోత్సవ వేడుకలు

**శిశు మందిర్ లో చదువుతో పాటు సంస్కారం, సంస్కృతి, దేశభక్తిని బోధిస్తారని.**

**మన దేశ సంస్కృతి సంప్రదాయలను నేర్పించే ఏకైక పాఠశాల : డాక్టర్ నరేష్ బాబు**




గజ్వేల్, 21ఏప్రిల్ 2026 : నేటి శుభోదయ: సిద్దిపేట జిల్లా : గజ్వేల్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ స్కూల్ వార్షికోత్సవం, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానోపాధ్యాయురాలు హరిణా పవన్ వ్యాఖ్యత గా వ్యవహరించారు, ఈ కార్యమానికి విశిష్ట అతిధిగా విచ్చేసిన సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేష్ బాబు మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశు మందిర్



పాఠశాలలో చదువుతో పాటు సంస్కారం, సంస్కృతి, దేశభక్తిని బోధిస్తారని, మన దేశ సంస్కృతి సంప్రదాయలను నేర్పించే ఏకైక పాఠశాల శ్రీ సరస్వతి శిశు మందిర్ అని, పేర్కొన్నారు, దేశానికి ఎందరినో డాక్టర్ లను, శాస్త్రవేత్తలను, మహానుభావులను అందించిన ఘనత శ్రీ శిశు మందిర్ పాఠశాల కె దక్కిందని కొనియాడారు, ఈ వేడుకలలో చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్కూల్ విద్యార్థి, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, గజ్వేల్ పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

## నేటి అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ సమ్మె




రాజేంద్రనగర్,ఏప్రిల్21(నేటి శుభోదయ):బుధవారం తెల్లవారుజాము నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె కొనసాగుతుందని ఆర్టీసీ కార్మికులు సూచించారు.రేవంత్ సర్కార్ తమ డిమాండ్లు పరిష్కరించాలని అనేకమార్లు సూచించిన పెడచెను పెట్టడంతో ఆఖరుకు సమ్మెకు తేవలసిన దుస్థితి ఏర్పడిందని సూచించారు. మమ్ములను ప్రభుత్వంలో విలీనం చేస్తానని చెప్పి మూడు సంవత్సరాలు కావస్తున్న పట్టించుకోకపోవడంతోనే సమ్మెకు దిగవలసిన దుస్థితి ఏర్పడిందని ఆర్టీసీ కార్మికుల డిమాండ్ చేశారు.ఇప్పటివరకు చర్చలకు పిలువని రాష్ట్ర ప్రభుత్వం,ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని కార్మికుల హెచ్చరించారు.ప్రభుత్వం చర్చలు జరపక పోతే సమ్మె తథ్యం అంటూ ఆర్టీసీ జేఏసీ ప్రకటన విడుదల చేసింది.ఒకవేళ చర్చలకు పిలిచినా గతంలో మాదిరి నామమాత్రం హామీ ఇవ్వకూడదనీ చెప్తున్న ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్.అన్ని డిమాండ్లపై హామీ ఇస్తేనే సమ్మె విరమణ ఆలోచన చేస్తామని స్పష్టం చేశారు.కార్మికులు సమ్మెలోకి వెళ్తే నిలిచిపోనున్న ప్రజా రవాణా వ్యవస్థ అని తెలిపారు.

## నేడే మాజీమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి వేడుకలకు అందరికి ఆహ్వానం:పి.కార్తీక్ రెడ్డి.



రాజేంద్రనగర్,ఏప్రిల్21(నేటి శుభోదయ):స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి మాజీ మంత్రి వర్ధంతి వేడుకల్లో ఈ క్రింది ప్రాంతాలలో నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గము బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పి.కార్తీక్ రెడ్డి తెలిపారు.బుధవారం ఉదయం 9:00 గంటలకు పాలమాకుల్,9:30 గంటలకు శంషాబాద్ టౌన్ (బస్ స్టాండ్ దగ్గర)10:00 గంటలకు రాజేంద్రనగర్ (డైరీ ఫామ్ దగ్గర)10:30 గంటలకు కిస్మత పూర్ (దర్గా దగ్గర),11:30 గంటలకు కౌకుంట్ల గ్రామం (చేవెళ్ల)లో పాల్గొంటారు.కావున ఈ కార్యక్రమాలకు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేయాలని కోరారు.

## భద్రగిరి మార్ట్ సృష్టి పై ప్రశంసల జల్లు

**- ఐటీడీఏ పిఒకు సీనియర్ ఐఏఎస్ అధికారిని శాంతి కుమారి అభినందనలు..**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21,( నేటి శుభోదయ),భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ఎంతో ప్రయోజనకరమని దీని ఏర్పాటులో విశేషంగా కృషి చేసిన భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఐఏఎస్ అభినందనీయులని మెచ్చుకుంటూ వైస్ చైర్‌పర్సన్ మరియు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.సి.ఆర్ హెచ్.ఆర్.డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ ఐటీడీఏ పీవో రాహుల్ కు ప్రశంసా పత్రం పంపించారు. భద్రాద్రి మార్ట్ చేస్తున్న ప్రశంసనీయమైన కృషిని నేను ఈ పత్రం ద్వారా అభినందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక గిరిజన ఉత్పత్తులకు విలువను జోడించి, బ్రాండింగ్ కల్పించి, భద్రగిరి మార్ట్ ద్వారా మార్కెట్ సౌకర్యాలను కల్పించడంలో మీ చొరవ నిజంగా అభినందనీయం అన్నారు. ఈ ప్రయత్నం గిరిజన వర్గాల ఆదాయాన్ని పెంచడమే కాకుండా, వారి ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌లతో అనుసంధానించడం ద్వారా వారిని సాధికారులను చేస్తుందని మరియు సమగ్ర అభివృద్ధికి ఇది ఎంతో తోడ్పడుతుందని నేను నమ్ముతున్నట్లు ఆ ప్రశంస పత్రంలో పేర్కొన్నారు.



## ఇండ్లు పొందిన లబ్దిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పకుండ నివసించాలి

**పూర్తి అయిన మరియు నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను లబ్దిదారులకు కేటాయించాలి.**

**2 బిహెచ్‌కే ఇండ్లు తీసుకున్న ఇంకా వాటిల్లో నివసించని వారికి కేటాయించిన ఇండ్లను నోటిస్ ఇచ్చి రద్దు చేయండి.**



రాజేంద్రనగర్,ఏప్రిల్21(నేటి శుభోదయ):ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయమ నుండి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో పూర్తి అయిన,నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించుటకు ఎంపిక చేసిన లబ్దిదారులకు కేటాయించాలని తెలిపారు.సంబంధిత ఆర్డీఓలు,డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుండి పేదవారిని ఎంపిక చేయాలని సూచించారు.డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్దిదారులు వాటిలో నివాసం ఉండని లబ్దిదారులందరు వెంటనే తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలని,ఏమైనా ఇబ్బందులు తెలియజేయాలని,లేని యెడల వారికి కేటాయించిన ఇండ్లను రద్దు చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు.సంబంధిత అధికారులందరూ పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్,జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.చాంప్లా నాయక్,ఆర్డీఓలు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు,హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.




## కాటేదాన్ లో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం:ఎస్ వెంకటేష్



రాజేంద్రనగర్,ఏప్రిల్ 21(నేటి శుభోదయ):రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ లో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్,మైలార్దేవపల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగినది.హైడ్రా అంటే పేదల ఇండ్లను కూల్చుడేనా? రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..వచ్చిన మొదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తాం..జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్..వెల్లడించిన శుభ సందర్భంగా రెండు డివిజన్ నాయకులు కార్యకర్తలు కోలహాలంగా కేసీఆర్ చిత్రపటానికి ఘనముగా పాలాభిషేకం చేయడం జరిగినది.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..రాజేంద్రనగర్ నియోజకవర్గం పరివాహక ప్రాంతంలో మూసి సుందరీకరణ డ్రామాతో పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేతల పై నిరంతర పోరాటం సాగించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తనదైన శైలిలో ప్రజా పక్షాన నిలిచిన తీరు యావత్ తెలంగాణ అబ్బురపరిచేలా ఉన్నది.వారి పోరాట పటిమకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మొదలుకొని సబితా ఇంద్రా రెడ్డి,హరీష్ రావు అనేక దఫాలుగా పర్యటించి మూసీ పరివాహక ప్రాంతము లో పేదల ఇళ్లను కూల్చివేసే హైడ్రా ను అడ్డుకున్న తీరు హర్షణీయం అని కొనియాడారు.ఈ సందర్భంగా ఇదే విషయంపై నిన్న జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైడ్రా పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ..బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే మొదటి సంతకంతోనే హైడ్రాని ఎత్తి అవతల పడేస్తం.పేదల ఇండ్లు కూల్చుడేనా హైడ్రా పని? మేము అధికారంలోకి ఉన్నప్పుడు 3.5 లక్షల పేదల కుటుంబాలకు పట్టాలు ఇచ్చినం.ఇప్పుడేమో కనీసం పిల్లల పుస్తకాలు కూడా తీసుకోనివ్వకుండా ఇండ్లు కూలుస్తున్నారు.భూములు కబ్జా చేయడానికి మూసీ నది దగ్గరున్న పేదల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు.హైడ్రా అంటే పేదల కొంపలను కూల్చుడేనా,..రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..వచ్చిన మొదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తాం! మూసీ పేరుతో 15 వేల పేదల ఇండ్లు కూలగొడతారా?ఇదంతా భూములు కబ్జా పెట్టి రియల్ ఎస్టేట్ దందా,దోపిడీ కోసమే అని కెసిఆర్ అన్నారు అని వెంకటేష్ తెలిపారు.కెసిఆర్ మాటలు యావత్ తెలంగాణ ప్రజానీకము సంతోషం వ్యక్తపరుస్తూ ఉందని కొనియాడుతూ రాబోయే రోజుల్లో హైడ్రా నుంచి విముక్తి కలుగుతుందని భావిస్తూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పేదల పక్షంన నిలిచిన కేసీఆర్ కు కృతజ్ఞతా భావంగా పాలాభిషేకం చేయటం జరిగిందని వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్,మైలర్ దేవ్ పల్లి పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్,రమేష్ ముదిరాజ్,అక్కెం రాఘవేందర్ యాదవ్,రాజేష్ యాదవ్, సరిత మహేష్, తిరుపతి రెడ్డి,యాదయ్య,కొంపల్లి జగదీష్, వెంకటరమణ ,మైసిరెడ్డి, ఆపో్క రాజు, బాలరాజు యాదవ్,సునీల్,రాజ్ కుమార్,అశోక్ కుమార్, ఈర్లపల్లి ప్రవీణ్,అనిల్,సింహాచలం,నరేష్ యాదవ్, మల్లేష్, సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మహేందర్, నరేష్, చంద్రశేఖర్ రెడ్డి,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు..

## వరంగల్ డిపిఅర్ఓ ప్రేమలతను ఘనంగా సన్మానించిన

**--బహుజన సంఘాల నాయకులు**



వరంగల్ ప్రతినిధి : ఏప్రిల్ 21 నేటి శుభోదయ: వరంగల్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి(డిపిఅర్ఓ)గా అదనపు బాధ్యతలు చేపట్టిన భావండ్లపల్లి ప్రేమలతను మంగళవారం పలువురు బహుజన సంఘాల నాయకులు వరంగల్ (డిపిఅర్ఓ) కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి, పులబోకే అందజేసి అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమ్ మిషన్ ఐడియాలజీ హన్మకొండ జిల్లా కన్వీనర్ దండు మోహన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బండి అశోక్,మాల సంఘాల జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పోనుగంటి లక్ష్మీనారాయణ, కోకన్వీనర్లు వంగేటి రాజమౌళి,దండ్రే సదానందం, పోతుల కొమ్మలు,దండ్రే శ్రీనివాస్, సదువాల సారంగపాణి,దార నర్సయ్య, శేషాద్రి నాగులు తదితరులు పాల్గొన్నారు.

# చత్తీస్ గడ్ రెడ్ కారిడార్ లో క్షీణించిన ఎడమ పక్ష తీవ్రవాదం

**– శాంతి ఆర్థిక శాస్త్రం, అభివృద్ధి వామపక్ష తీవ్రవాదాన్ని ఎలా అణచివేసింది**

హైదరాబాద్, నేటి శుభోదయ ::: దశాబ్దం క్రితం ఊహించడానికే కష్టమైన కథ. భారతదేశంలోని ఒకప్పుడు తీవ్ర అశాంతితో ఉన్న "రెడ్ కారిడార్" ప్రాంతాల్లో ఎడమపక్ష తీవ్రవాదం భౌగోళికంగా గణనీయంగా క్షీణించింది, హింస తగ్గింది, మరియు ప్రభుత్వం ఒకప్పుడు తక్కువగా పరిపాలించిన ప్రాంతాల్లో లోతుగా ప్రవేశించింది. ఈ మార్పుకు కారణం కేవలం సాయుధ శక్తి కాదు, తిరుగుబాట్ల ఆర్థిక, రాజకీయ పరిస్థితులను మార్చిన అభివృద్ధి వ్యూహం స్థిరంగా అమలవడం.2010లో అత్యున్నత స్థాయికి చేరినప్పుడు, మావోయిస్టు హింస ప్రతి సంవత్సరం 1,100కు పైగా మరణాలకు దారితీసింది. ప్రస్తుతం, ఘర్షణ యొక్క పరిమాణం, తీవ్రత గణనీయంగా తగ్గాయి, అలాగే ప్రభావిత జిల్లాల సంఖ్య 2013లో 126 నుండి 2024లో కేవలం 38కు పడిపోయింది. ఈ తగ్గుదల ఒక నిర్మాణాత్మక మార్పును ప్రతిబింబిస్తుంది–ఎక్కడైతే ఒకప్పుడు వేరుపాటు, పేదరికం, ప్రభుత్వ లేమి తిరుగుబాట్లకు పునాది అయ్యాయో ఆ ప్రాంతాల్లో. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ( ఓ ఆర్ ఎఫ్ ) ప్రత్యేక నివేదికను సంపాదించిన నిరంజన్ సహూ, అంబర్ కుమార్ ఘోష్ పేర్కొన్నట్లుగా, మావోయిస్టు ప్రభావం ప్రధానంగా పెరిగింది ఎక్కడైతే తీవ్రమైన వెనుకబాటు, బలహీన పరిపాలన కలిసివచ్చాయో అక్కడ. ఈ పరిస్థితులు తిరుగుబాటుదారులకు ప్రత్యామ్నాయ అధికార వ్యవస్థలను నిర్మించేందుకు అవకాశం ఇచ్చాయి. గత దశాబ్దంలో భారతదేశం తన వ్యూహాన్ని మార్చిన ముఖ్య కారణం ఏమిటంటే, ఎడమపక్ష తీవ్రవాదం మూలంగా అభివృద్ధి వైఫల్యమే అని గుర్తించడం. అందువల్ల, భారతదేశం తీసుకున్న చర్యలు అభివృద్ధి ఆర్థికశాస్త్రం, భద్రతా వ్యూహాన్ని సమన్వయం చేసే హైబ్రిడ్ నమూనాగా మారాయి. దీర్ఘకాలిక శాంతి కోసం రాష్ట్ర సామర్థ్యం, ఆర్థిక అవకాశాల విస్తరణ అవసరమైంది.ఈ వ్యూహం మూడు ప్రధాన స్తంభాలపై ఆధారపడింది. మొదటిది, రహదారులు, టెలికాం, ఆర్థిక సేవలు, భద్రత వంటి రంగాల్లో సమన్వయంతో కూడిన ప్రజా పెట్టుబడులు అభివృద్ధిని అడ్డుకునే సమన్వయ లోపాలను అధిగమించడంలో సహాయపడతాయి. రెండవది, మార్కెట్ వైఫల్యాలను సరిదిద్దడంలో రాష్ట్ర సామర్థ్యపు పాత్ర: ప్రమాదం, దూరప్రాంతాల కారణంగా ప్రైవేట్ పెట్టుబడులు ప్రవేశించని చోట ప్రభుత్వం మౌలిక వసతులు, సంస్థల్లో ప్రధాన పెట్టుబడిదారుగా వ్యవహరించింది. మూడవది, వెనుకబడిన ప్రాంతాలను జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేయడం ద్వారా అసమానతలను తగ్గించడం, ఘర్షణకు ఆర్థిక పునాదులను బలహీనపరచడం. అందువల్ల, అమలైన విధాన ప్రతిస్పందన బలవంతపు సామర్థ్యాన్ని, ప్రజా సదుపాయాల విస్తరణను కలిపి కొనసాగించింది. భౌతిక కనెక్టివిటీ మార్పులో ఇది అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది. రహదారి నిర్మాణం, ఒకప్పుడు చేరుకోలేని ప్రాంతాల్లో దూరాన్ని, సమయాన్ని గణనీయంగా తగ్గించింది. ప్రభుత్వ వర్గాల ప్రకారం, ఉదాహరణకు బస్తర్ డివిజన్లో నారాయణపూర్ దంతేవాడ – జెగురు గొండ కారిడార్లో ప్రయాణ దూరం 295 కిలోమీటర్ల నుండి 201 కిలోమీటర్లకు తగ్గింది, ప్రయాణ సమయం దాదాపు పది గంటల నుండి ఐదు గంటలలోపుగా తగ్గింది. ఇదే విధంగా, బీజాపూర్–పామేడ్ మార్గం 250 కిలోమీటర్ల నుండి 110 కిలోమీటర్లకు తగ్గి, ప్రయాణ సమయం సగానికి పడిపోయింది. ఈ మార్పులు "ఆర్థిక దూరం"లో ఒక ప్రాథమిక తగ్గుదలను సూచిస్తాయి వ్యవహార వ్యయాలను తగ్గించడం, కార్మికుల చలనం సులభతరం చేయడం, స్థానిక ఆర్థిక వ్యవస్థలను విస్తృత మార్కెట్లతో అనుసంధానం చేయడం. టెలికమ్యూనికేషన్ విస్తరణ ఈ మార్పును మరింత బలపరిచిందని వర్గాలు చెబుతున్నాయి. బస్తర్లో మాత్రమే, మొబైల్ టవర్ కవరేజ్ 2021లో 3,244 గ్రామాలకు సేవలందిస్తున్న కేవలం 581 టవర్ల నుండి, 202425లో 700కు పైగా కొత్త టవర్లు ఏర్పాటు చేయబడటం, వందలాది టవర్లు 2+ నుండి 4+కి అప్గ్రేడ్ కావడం ద్వారా వేగంగా విస్తరిస్తున్న సాంద్ర నెట్వర్క్ మారింది. ఈ విధంగా పరిమిత కనెక్టివిటీ నుండి దాదాపు సంపూర్ణ కనెక్టివిటీకి మార్పు గొప్ప ప్రభావాలను కలిగిస్తుంది.

ఇది నేరుగా లబ్ధి బదిలీలను సాధ్యం చేస్తుంది, ఆర్థిక సమగ్రతను విస్తరిస్తుంది, ఒకప్పుడు తిరుగుబాటు గుంపులు ఆధారపడిన సమాచార ఏకాధిపత్యాన్ని చెదరగొడుతుంది.ఈ పెట్టుబడులు బహుగుణ ప్రభావాలను సృష్టిస్తాయి. కనెక్టివిటీ మార్కెట్ అవరోధాలను తగ్గిస్తుంది, సేవలకు ప్రాప్యతను మెరుగుపరుస్తుంది, కార్మికశక్తి, మూలధనంపై లాభాలను పెంచుతుంది. ఘర్షణ ప్రాంతాల్లో పెట్టుబడికి రాజకీయ కోణం కూడా ఉంటుంది. ఇది ప్రభుత్వాన్ని కనిపించేలా, అందుబాటులో ఉండేలా చేస్తుంది, పరిపాలన లోటును తగ్గించడానికి సహాయపడుతుంది.ఈ మౌలిక వసతుల విస్తరణకు తోడు, ప్రభుత్వ సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగింది. ప్రభావిత ప్రాంతాల్లో 574కి పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాల కంపెనీలు మోహరించబడ్డాయి, వీటికి పెద్ద మొత్తంలో ఆర్థిక వ్యయం మద్దతుగా ఉంది. 2014 నుండి, సెక్యూరిటీ రిలేటెడ్ ఎక్స్పెండిచర్ పథకం ద్వారా రూ.3,400 కోట్లకు పైగా నిధులు వినియోగించబడ్డాయి; అదేవిధంగా స్పెషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ కింద రూ. 1,700 కోట్లు ఖర్చు చేసి వందలాది బలపరిచిన పోలీస్ స్టేషన్లు నిర్మించబడ్డాయి. అదనంగా రూ. 1,200 కోట్లకు పైగా నిధులు కేంద్ర సంస్థల కార్యకలాపాలను బలపరిచాయి. ఈ పెట్టుబడులు భద్రతా వ్యవస్థను విస్తృతంగా ఏర్పాటు చేశాయి, ముఖ్యంగా అభివృద్ధి ప్రాతిపదికలో భాగంగా.స్థానిక ప్రజలను ఈ భద్రతా వ్యవస్థలో భాగం చేయడం కూడా సమానంగా ముఖ్యమైనది. బస్తర్ బటాలియన్ వంటి ప్రత్యేక దళాల్లో 1,100కు పైగా గిరిజన యువతను నియమించడం ద్వారా ఉపాధి అవకాశాలను భద్రతా లక్ష్యాలతో అనుసంధానం చేశారు.భద్రతా మౌలిక వసతులను అభివృద్ధి సేవల అందించడానికి ఒక సాధనంగా మళ్లీ వినియోగిస్తున్నారు. పోలీస్ శిబిరాలు ఇకపై కేవలం కార్యాచరణ స్థావరాలుగా కాకుండా, పరిపాలనా కేంద్రాలుగా మారాయి. ఈ శిబిరాల నుంచే కొత్త బస్సు సేవలు ప్రారంభించబడ్డాయి, స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారి అనేక చేరుకోలేని గ్రామాలను అనుసంధానం చేస్తూ. 73 గ్రంథాలయాల ప్రారంభం వంటి సామాజిక కార్యక్రమాలు పౌర జీవనంలో సాధారణీకరణను సూచిస్తున్నాయి. ఈ సూక్ష్మస్థాయి మార్పులు ముఖ్యమైన ఆర్థిక సంకేతాలను అందిస్తున్నాయి. అంతర్గత గిరిజన ప్రాంతాల్లో రెండు చక్రాల వాహనాల అమ్మకాలు 5,000 యూనిట్లకు పైగా మూడు రెట్లు పెరగడం, వినియోగానికి అందుబాటులో ఉన్న ఆదాయం పెరుగుతున్నదని, స్థానిక మార్కెట్లు విస్తరిస్తున్నాయని సూచిస్తుంది. గడ్చిరోలిలో, 1.5 లక్షల ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యంతో పెద్ద ఉక్కు కేంద్రం అభివృద్ధి సహా భారీ పరిశ్రమల పెట్టుబడుల అవకాశాలు నిర్మాణాత్మక మార్పుల ప్రారంభ దశలను సూచిస్తున్నాయి. ఇవి జీవనోపాధి ఆధారిత ఆర్థిక వ్యవస్థల నుండి విభిన్న, మార్కెట్కు అనుసంధానమైన వ్యవస్థల వైపు మార్పుకు పునాది బ్లాకులుగా నిలుస్తాయి. ఈ జోక్యాల సమిష్టి ప్రభావం హింస యొక్క మారుతున్న గమనంలో కనిపిస్తుంది. కనెక్టివిటీ, ప్రభుత్వ ఉనికి విస్తరించడంతో, తిరుగుబాటుదారుల కార్యకలాపాలకు ఉన్న స్థలం క్షీణించింది. ఇటీవల సంవత్సరాల డేటా స్పష్టమైన ప్రతికూల సంబంధాన్ని చూపుతోంది: వేగంగా మౌలిక వసతులు, టెలికాం విస్తరించిన ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గణనీయంగా తగ్గాయి. అభివృద్ధి జోక్యాలు అవకాశ నిర్మాణాలను, ప్రోత్సాహక వ్యవస్థలను మార్చడం ద్వారా తిరుగుబాటుదారుల ప్రభావాన్ని క్రమంగా తొలగిస్తున్నాయి.సంస్థాగత స్థాయిలో, ఈ కొత్త పరిస్థితులకు మావోయిస్టు ఉద్యమం సరిపడటంలో కష్టాలను ఎదుర్కొంది. నాయకత్వ నష్టాలు తీవ్రమయ్యాయి. 2025 చివరికి, కేంద్ర నాయకత్వంలో చిన్న భాగం మాత్రమే క్రియాశీలంగా మిగిలి, ఉద్యమం స్థానిక, ప్రతిస్పందనాత్మక యూనిట్లుగా క్షీణించింది. ముఖ్యంగా, ఈ క్షీణత ఒకప్పుడు నియామకం, సమీకరణకు దోహదపడ్డ సామాజిక–ఆర్థిక పరిస్థితులలో వచ్చిన సానుకూల మార్పులతో ముడిపడి ఉంది. అభివృద్ధి రాజకీయాల దృష్టిలో, అత్యంత ముఖ్యమైన మార్పు ప్రభుత్వ చట్టబద్ధత స్వరూపంలో కనిపించింది. ఒకప్పుడు ప్రభుత్వం లేకపోయిన లేదా నమ్మకం లేని ప్రాంతాల్లో, ఇప్పుడు అది రహదారులు, కనెక్టివిటీ, సంక్షేమం, ఉపాధి వంటి స్పష్టమైన లాభాలతో అనుసంధానమవుతోంది. ఈమార్పు ఒక విస్తృత సూత్రాన్ని ప్రతిబింబిస్తుంది: చట్టబద్ధత కేవలం అధికారంతోనే కాదు, సేవల అందించడంతో కూడా నిర్మితమవుతుంది. రోజువారీ ఆర్థిక జీవితంలో భాగమవడం ద్వారా, ప్రభుత్వం నిర్లక్ష్యం మరియు వెలివేతపై తిరుగుబాటుదారుల కథనాలను క్రమంగా తొలగించడం ప్రారంభించింది.

ఇవి అన్నీ సమస్య పూర్తిగా పరిష్కారమైందని సూచించవు. భూమి హక్కులు, అటవీ పరిపాలన,,షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రక్షణాత్మక చట్టాల అమలు వంటి అంశాలపై ఇంకా సమస్యలు కొనసాగుతున్నాయి.అయినప్పటికీ, ఇప్పటి వరకు ఫలితం నిశ్శబ్దమైన కానీ గాఢమైన మార్పుగా కనిపిస్తోంది. ఒకప్పుడు ప్రభుత్వ పరిధికి దూరంగా ఉన్న గ్రామాలు ఇప్పుడు రహదారులు , మొబైల్ నెట్వర్క్లు అనుసంధానమయ్యాయి, స్థానిక ఆర్థిక వ్యవస్థలు క్రమంగా చైతన్యవంతమవుతున్నాయి. "రెడ్ కారిడార్" ఇప్పుడు కనెక్టివిటీ, మార్కెట్లు, సంస్థల ద్వారా రూపాంతరం చెందుతోంది సమగ్రంగా అమలు చేసిన అభివృద్ధి, కేవలం శక్తితో సాధ్యం కానిదాన్ని సాధించగలదని నిరూపిస్తోంది.

# ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యం

**: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**– ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంతో పఠన సామర్థ్యంలో గణనీయమైన పురోగతి**

**–వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టితో ప్రత్యేక పాఠ్యసామగ్రి**

**– ఎస్ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం ఎస్ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం వల్ల విద్యార్థుల పఠన సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు స్వతంత్ర సంస్థ నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. ఈ పురోగతిపై వారు సంతోషం వ్యక్తం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పఠన సామర్థ్యం అత్యంత కీలకమని భావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పిల్లలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ నిర్వహించామని, వారానికి ఒకసారి అంచనాలు నిర్వహిస్తూ, ఫలితాల ఆధారంగా వ్యూహాలను మారుస్తూ ముందుకు తీసుకెళ్లామని అన్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి ప్రత్యేక పాఠ్య సామగ్రిని రూపొందించా మని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వారికి వేర్వేరు విధానాలు అమలు చేశామని తెలిపారు. ఏఐ సాంకేతికతతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసి, ఉపాధ్యాయులపై అంచనాల భారం లేకుండా సులభంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయగలిగే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆనంద దాయకంగా రూపొందించడంతో పిల్లలు ఆసక్తిగా పాల్గొన్నారని పేర్కొన్నారు.డిసెంబర్ నెల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులకు, వెనుకబడిన విద్యార్థులకు వేర్వేరు పాఠ్య సామగ్రిని అందించామని, రోజూ పాఠశాల సమయాల్లోనే సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి రోజు ఉపాధ్యాయుల,విద్యార్థుల కార్యకలాపాలు, కథల పఠనం వంటి అంశాలతో సమగ్ర ప్రణాళికను అమలు చేశామని వివరించారు. అక్షరాలు, పదాలు, వాక్యాలు అనే మూడు స్థాయిలలో విద్యార్థుల పఠన సామర్థ్యాల అంచనా నిర్వహించామని తెలిపారు. అక్టోబర్‌లో కార్యక్రమం ప్రారంభించినప్పుడు సుమారు 55 శాతం విద్యార్థులు అక్షర స్థాయిలో, 34 శాతం పదాల స్థాయిలో, 11 శాతం వాక్య స్థాయిలో ఉన్నారని చెప్పారు. 21 వారాల కృషి ఫలితంగా ప్రస్తుతం 29 వేల మంది విద్యార్థుల్లో 85 శాతం మంది వాక్యాలు చదవ గలుగుతున్నారని, మొత్తం 21,309 మంది విద్యార్థులు వాక్య పఠనంలో నైపుణ్యం సాధించారని తెలిపారు.పిల్లలు సహజంగానే ఆసక్తి కలిగినవారని, వారికి పఠనంపై నమ్మకం పెరిగితే వారు మరింత జ్ఞానం స్వయంగా సంపాదించ గలరని అన్నారు. జిల్లాలోని పలు శాఖల అధికారులు కూడా పాఠశాలలను సందర్శించి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, వెనుకబడిన మండలాలు, క్లస్టర్లలో మెరుగుదలకు సహకరించారని తెలిపారు. ఎన్నికలు, దసరా సెలవులు వంటి అనేక అంతరాయాలు వచ్చినప్పటికీ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించా మని, అందువల్లే మంచి ఫలితాలు సాధించగలిగామని అన్నారు. ప్రతి బుధవారం అంచనా ఫలితాలను విశ్లేషిస్తూ, నిరంతర కృషితో 11 శాతం నుంచి 85 శాతం వరకు సాధించిన ఈ ప్రయాణం ఒక్క రోజులో సాధ్యంకాలేదని, ప్రతి వారం మెరుగుదల సాధించామని తెలిపారు.ఈ విజయానికి ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ







గర్వించాల్సిన అవసరం ఉందన్నారు. తాను యూపిఎస్సి సన్నద్ధతలో ఉన్న సమయంలో అజర్ నివేదికల్లో 5వ తరగతి విద్యార్థుల్లో 55 శాతం మంది 2వ తరగతి పుస్తకాలు కూడా చదవలేరని పేర్కొనబడిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఖమ్మం జిల్లాలో ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని అన్నారు. ఫిబ్రవరి 2026లో సితార్ ఎస్ సిఈఆర్ టి బృందం విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని అంచనా వేసిందని తెలిపారు. ఇదే సమయంలో ఎవ్రీ చైల్డ్ రీడ్స్ డేటా కూడా ఇదే స్థాయిలో ఉందని, డేటాలో ఎలాంటి వ్యత్యాసం లేకపోవడం ఈ కార్యక్రమం సమర్థతను నిరూపిస్తుందని తెలిపారు. మంచి పఠన నైపుణ్యాలు ఉండటం వల్ల విద్యార్థులు ఇతర విషయాలను సులభంగా అర్థం చేసుకుని విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించు కుంటారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో పద పఠనం సగటు 29 శాతం కాగా, ఖమ్మం జిల్లాలో 53 శాతం ఉందని, వాక్య పఠనం రాష్ట్రంలో 32 శాతం కాగా, ఖమ్మంలో 52 శాతం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం గణితం వంటి ఇతర విషయాలలో కూడా విద్యార్థుల ప్రతిభను పెంపొందించడంలో సహాయపడుతోందని అన్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఒక గొప్ప నైపుణ్యాన్ని అందించామని, రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం విద్యార్థులు వాక్యాలు చదవగలిగే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. తదుపరి దశలో విద్యార్థుల పఠన వేగాన్ని పెంపొందించడం, అర్థ గ్రహణ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. నిమిషానికి 30, 40, 50 పదాలు చదవగలిగే లక్ష్యాలను నిర్దేశించి పని చేయాలని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసి ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఈ రోజు సివిల్ సర్వీసెస్ డే కావడం, ఇదే రోజు ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం విజయోత్సవాన్ని జరుపుకోవడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, జిల్లా యంత్రాంగం అందరూ ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. గత ఆరు నెలల్లో 75 శాతం మేర పఠన సామర్థ్యంలో వృద్ధి సాధించడం విశేషమని పేర్కొన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం విద్యార్థుల పఠన నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేసి ప్రతి విద్యార్థికి ఉపయోగపడేలా చేయాలని సూచించారు. అనంతరం ఈసిఆర్ అమలులో ఉత్తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు మెమోంటోలు అందజేసి, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా విద్యా శాఖ అధికారి చైతన్య జైనీ, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు,




సంబంధిత అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి కరకట్ట ప్రదేశాలలో ప్రకృతి వనం ఏర్పాటు

**భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21,( నేటి శుభోదయ),భద్రాచలంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న దశాబ్దాల నాటి పురాతన చెత్త డంప్ సైటును ఐటీడీఏ పీవో బి రాహుల్ మరియు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి పనిచేసిన సమయంలో ఆయన మద్దతుతో సబ్ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ సమగ్ర గ్రీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ప్రారంభించడంతో గోదావరి కరకట్ట ప్రదేశాలలో ప్రకృతి వనం ఏర్పాటుకు మార్గం సుగమమైనదని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు.మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి గత సంవత్సరం గోదావరి కరకట్ట ప్రదేశాలలో చేపట్టిన కార్యక్రమాల గురించి ఆయన పూర్తిస్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2025 మరియు ఫిబ్రవరి 2026 మాసంలో ప్లాస్టిక్ వ్యర్థాలను 100 కిలోల వరకు తొలగించడం జరిగిందని అలాగే అక్టోబర్ 2025లో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఐదు ఎకరాలలో పదివేల యూకలిప్టస్ మొక్కలు గ్రామ పంచాయతీ సహకారంతో నాటించి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవడం జరిగిందని అన్నారు. నవంబర్, డిసెంబర్ 2025 మాసములో దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్తను క్లియర్ చేయడానికి భారీ యంత్రాలను మోహరించి, ఇసుక ఎక్స్ వెయిటర్ లారీలు వ్యర్థాలను గ్రామ పద్ధతిలో తొలగించడం జరిగిందని అన్నారు. క్లియర్ చేసిన భూమిని గ్రైండింగ్ చేసి ప్లాంటేషన్ కోసం సిద్ధం చేసి భద్రాచలం జిపి ద్వారా బయో రీమిడేయేషన్ ప్రయత్నంగా పదివేల యూకలిప్టస్ మొక్కలు నాటి గ్రామ పంచాయతీ భద్రాచలం ద్వారా క్రమం తప్పకుండా వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నారని అన్నారు. గోదావరి ఒడ్డున ఉన్న గ్రీన్ జోన్ క్లైమ్ చేసిన వ్యర్థాల డంపింగ్ యార్డ్ నుండి కనిపించే రూపాంతరం రాబోయే రెండు మూడు సంవత్సరాల లో గోదావరి నది తీర ప్రాంతం యొక్క పర్యావరణ ఆరోగ్యాన్ని గన్నియంగా పెంచుతుందని ప్రాంతాన్ని మరింత శుభ్రపరచడం మరియు పునర్ధరించడంలో మంచి పురోగతి సాధిస్తుందని అన్నారు. దీని ప్రభావం వలన దశాబ్దాల నాటి చెత్త డంపింగ్ స్థలం గోదావరి పొడవున మంచి గ్రీన్ జోన్ గా రూపాంతరం చెంది పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరిస్తుందని దీంతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజానీకానికి ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు. సారపాక భద్రాచలం వంతెన జాతీయ రహదారి అధికారులతో నిరంతర సమన్వయం ఫలితంగా 2026 మార్చ్ లో సారపాక భద్రాచలం వంతెన పై వీధిలైట్లు ఏర్పాటు చేయబడ్డాయని దీర్ఘకాలంగా ఉన్న ప్రజా భద్రత సమస్యను పరిష్కరించడం జరిగిందని అన్నారు. సి ఎస్ ఆర్ కార్యకలాపాల కింద ఐటీసీతో సమన్వయం చేసుకొని వంతెనకు రెండు వైపుల నుండి అప్రోచ్ రోడ్ల మధ్యస్థం పొడవునా పూల పెంపకం మరియు గ్రీన్ కవర్ పెంపుదల చేపట్టిందని, మార్చి 2026 లో పూర్తయిందని, దీని ఫలితంగా సౌందర్యం మరియు ఆకుపచ్చ కవర్ గనియంగా మెరుగుపడిందని అన్నారు. బ్రిడ్జి ఇకె ఇల్యూమీనేషన్ ద్వారా మెరుగైన రహదారి భద్రత, కీలకమైన ధమనుల రోడ్ల వెంట సౌందర్యం మరియు గ్రీన్ కవర్ తో గణనీయమైన మెరుగుదల, పరిపాలన మరియు కార్పొరేట్ సిఎస్ఆర్ మధ్య సమర్థవంత మైన సమన్వయం ద్వారా సాధించబడిందని ఆయన అన్నారు.







# హాష్ అయిల్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు




**–కోట్ల విలువ గల హాషీష్ ఆయిల్ స్వాధీనం**

వరంగల్ ప్రతినిధి : ఏప్రిల్ 21 నేటి శుభోదయ :వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతంలో ఎప్పుడు లేని తోలిసారిగా భారీ స్థాయిలో హాష్ ఆయిల్ (గంజాయి మొక్కల నుండి తీసిన నూనె) స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠాలోని నలుగురు సభ్యులను వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా కలసి అరెస్టు చేసారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 2 కోట్ల 50లక్షల విలువ గల హాష్ ఆయిల్‌తో రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1. హంటల్ సన్ను (23),సువ్వపల్లి గ్రామం,చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రం, 2.హంటల్ సన్యాసి (23), రేకపల్లి,,చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రం, 3. కండెల చిన్నబాబు (56), దారకొండ గ్రామం,గూడెం మండలం, అల్లూరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, 4.కృష్ణా హంటల్ (56), రేకపల్లి,,చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రానికి చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీ వున్నాడు ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను తెలియజేస్తూ పట్టుబడిన నిందితులందరు పరిచయస్తులు కాగా, ఇందులో ప్రధాన నిందితుడు హంటల్ సన్ను తన స్వగ్రామంలో గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని మిగితా నిందితుల ద్వారా విక్రయించి సోమ్ము చేసుకుని జల్సాలకు చేసేవారు. కాని నిందితులకు గంజాయి విక్రయాలలతో వచ్చే డబ్బు వారి జల్సాలకు సరిపోకపోవడంతో ప్రధాన నిందితుడు గంజాయి మొక్కల నుండి హాష్ అయిల్‌ను తయారు చేసే మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో వున్న కిలో పాండు నిందితుడితో పరిచయం కావడంతో, పాండు ఇచ్చిన సూచనల మేరకు ప్రధాన నిందితుడు మిగితా నిందితులతో కలసి గంజాయి మొక్కలను పెంపకం చేపట్టిన అనంతరం, నిందితుడు పాండు తీసుకవచ్చిన పరికరం ద్వారా ఈ ముఠా సభ్యులు గంజాయి మొక్కలను ద్వారా 40కిలోల హాష్ అయిల్‌ను సేకరించారు. ఈ విధంగాంగా తయారు చేసిన హాష్ అయిల్‌లో 20కిలోల హాష్ అయిల్‌ను పాండు తను తీసుకోగా, మిగితా 20కిలోల హాష్ అయిల్‌ను కిలో చోప్పున ప్యాకేట్లలో భద్రపర్చి పట్టుబడిన నిందితడులందరు ఐదు కిలోల చోప్పున హాష్ అయిల్‌ను తీసుకోని ముంబాయిలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ తుని రైల్వే స్టేషన్ నుండి ఈ నెల 19 తేది అర్ధరాత్రి కోనార్క్ రైలులో బయలు దేరారు. వరంగల్ రైల్వేలో పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా ముఠా అనుమానం రావడంతో ఈ ముఠా సభ్యులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిన్నటి రోజు దిగిన నిందితులు మంగళవారం ఉదయం ముంబాయి వేళ్ళేందుకు ఈ ముఠా సభ్యులు ఈ రోజు ఉదయం వరంగల్ బస్టాండ్ వద్ద వున్న రైల్వే గూడ్స్ షెడ్ పరిసరాల్లో అనుమాస్పదంగా తిరుగున్నాట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు వెళ్ళి నిందితులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారివద్ద హాష్ అయిల్‌ను గుర్తించిన పోలీసులు నిందితులను అరెస్టు చేసిన 20కిలోల హాష్ అయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.పెద్ద ఎత్తున హాష్ అయిల్‌తో పాటు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, వరంగల్ ఏఎప్పీ శుభం, ఏసిపి లు జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, డ్రగ్ కంట్రోల్ టీం ఇన్స్‌స్పెక్టర్ వై.సతీష్,ఇంతేజార్‌గంజ్ ఇన్స్‌స్పెక్టర్ షూకూర్, ఎస్.ఐలు సందీప్, తేజ ఆర్.ఎస్.ఐలు ఏ.పూర్ణ చందర్ రెడ్డి,కె.మనోజ్ రెడ్డి, ఎల్.లింగారావు,క్యాట్ పార్టీ ఏ.ఆర్.ఏ.ఎస్.ఐలు వి.సుబ్బిరామి రెడ్డి,హెడ్ కానిస్టేబుళ్ళు బాలరాజు, కె.శ్రీరాములు,యం.డి రబ్బానీ,ఆర్.రాజ్‌కుమార్‌తో పాటు ఇంతేజార్‌గంజ్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## బహదుర్గూడ గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పరిస్థితులపై అవగాహన పెంపొందించుకు హార్టికల్చర్ విద్యార్థులు కృషి.



రాజేంద్రనగర్,ఏప్రిల్21(నేటి శుభోదయ):శంషాబాద్ మండలంలోని బహదుర్గూడగ్రామంలో గ్రామీణ వ్యవసాయ పరిస్థితులపై అవగాహన పెంపొందించుకునేందుకు హార్టికల్చర్ విద్యార్థులు గ్రామంలో క్షేత్ర సాయి అధ్యయనం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామ ప్రజలతో కలిసి గ్రామ పటం (సోషల్ మ్యాప్) వనరుల పటం (రిసోర్స్ మ్యాప్) రూపొందించి గ్రామంలోని సహజ వనరులు,వ్యవసాయ పరిస్థితులు,తోటల పంటల సాగు విధానాలను పరిశీలించారు రైతులతో నిర్వహించిన చర్చల్లో నీటి కొరత,పంటలకు పురుగుల ప్రభావం సరైన మార్కెట్ సదుపాయాల లోపం వంటి సమస్యల గురించి చెప్పారు.అనంతరం విద్యార్థులు రైతులకు ఆధునిక తోటల సాగు పద్ధతులు పంటలో సంరక్షణ విధానాలు హార్టికల్చర్ పంటల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యక్ష అనుభవం లభించగా గ్రామ ప్రజలకు నూతన సాగు పద్ధతులపై అవగాహన పెరిగిందన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు,గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ ఎన్ఐఆర్డి సర్కిల్ వద్ద గుడిసె యాదయ్య చలివేంద్రం ఏర్పాటు




రాజేంద్రనగర్,ఏప్రిల్21(నేటి శుభోదయ):వేసవి కాలంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు రాజేంద్రనగర్ ఎన్ఐఆర్డి సర్కిల్ వద్ద గుడిసె యాదయ్య చలివేంద్రం ఉచిత త్రాగు నీటి కేంద్రని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పార్టీ నాయకులు శ్రీధర్ హాజరై రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ..ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే గుడిసె యాదయ్య వేసవి కాలంలో పాదచారుల కోసం త్రాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు బాబు,ఎస్సీ మోర్చా డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇ.వేణు గోపాల్ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్ (చిన్నా), డివిజన్ ఉపాధ్యక్షురాలు సరితా రెడ్డి,నాయకులు సునిగంటి పెంటయ్య,బచ్చల రాజు,మంత్రి చంద్రశేఖర్,జ్ఞానేశ్వర్,జంగయ్య,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**వేసవిలో నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.**

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**



వరంగల్ ప్రతినిధి : ఏప్రిల్ 21 నేటి శుభోదయ :అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలనీ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.మంగళవారం వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం యందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో పంచాయతీరాజ్ మరియు రెవెన్యూ శాఖ అధికారులతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్నినిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామాలలో ముఖ్యంగా శానిటేషన్, డ్రింకింగ్ వాటర్, లైటింగ్ వ్యవస్థ పై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎక్కడైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.వేసవికాలంలో గ్రామాల్లో ఎక్కడ కూడా నీటికి సంబంధించిన సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు.గ్రామాలలోని ఓహెచ్ ఎస్సార్ వాటర్ ట్యాంకులలో మిషన్ భగీరథ, రా వాటర్ కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి వృధా అని అరికట్టాలని, నీటిని సక్రమంగా వాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించాలన్నారు. అలాగే గుడుంబా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గంజాయి మరియు డ్రగ్ సంబంధించిన ఏవైనా అసంఘీక కార్యక్రమాలు జరిగినట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.గ్రామల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి అన్నారు.రేషన్ షాపులలో బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒకరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ, ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంపీ ఓ, జిపిఒ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హిల్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు వినతి పరిశీలనకు వస్తానని జోనల్ కమిషనర్ హామీ



నేరెడ్ మెట్, ఏప్రిల్ 21:శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని జర్నలిస్టుల హిల్ కాలనీలో మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక జర్నలిస్టులు మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. శామీర్‌పేట్ డివిజన్‌లోని రిజిస్ట్రేషన్ నెంబర్ 53/26, సర్వే నెంబర్ 1239/2 పరిధిలో ఉన్న జర్నలిస్టుల హిల్ కాలనీలో మౌలిక వసతుల కల్పన కోసం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను వివరించిన వారు, రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్ దీపాలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గతంలో ప్రభుత్వం జర్నలిస్టులకు వికార్ సెక్షన్ కింద 120 గజాల చొప్పున స్థలాలను కేటాయించగా, కొంతమంది ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నప్పటికీ ప్రాథమిక సదుపాయాల లేమితో జీవన విధానం కష్టసాధ్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ వినతిపై స్పందించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు కాలనీకి వచ్చి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల హిల్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డమీది యాదగిరి, వైస్ ప్రెసిడెంట్ జార్జి విల్సన్ బండారి, ప్రధాన కార్యదర్శి బొమ్మెట్ట శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, సభ్యులు దేశం కృష్ణతో పాటు ఉప్పల్ మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి,మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్. బాలరాజు, ప్రధాన కార్యదర్శి విశాల్, గోపాల్, సంగమేష్, నందీశ్వర్, రాములు, గణేష్,మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హిల్ కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలి



శామీర్‌పేట్, ఏప్రిల్ 21:శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని జర్నలిస్టుల హిల్ కాలనీలో మౌలిక వసతుల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కీసరా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలసి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా ఆమె గైర్హాజరు కావడంతో ఏఎంసీ వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్ నెం. 53/26, సర్వే నెం. 1239/2 పరిధిలో ఉన్న ఈ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇదే సమస్యలపై మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కూడా కలిసి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం జర్నలిస్టులకు వికార్ సెక్షన్ కింద 120 గజాల స్థలాలు కేటాయించినప్పటికీ, మౌలిక వసతుల లేమితో జీవనం కష్టసాధ్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డమీది యాదగిరి, ఉప్పల్ మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి విశాల్, జి. గోపాల్ గౌడ్, కృష్ణ రెడ్డి, సాయి లీలా తదితరులు పాల్గొన్నారు.c సి ఎం ఎస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన రాగం నాగేందర్ యాదవ్.. శేరిలింగంపల్లి నేటి శుభోదయ..:సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ జి.సృజన ఐ ఎ ఎస్ ని సైబరాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చి సత్కరించిన శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ శేరిలింగంపల్లి డివిజన్ లో నూతనంగా నిర్మాణం చేపట్టబోయే ఫ్లైఓవర్ అభివృద్ధి వలన రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని.. కానీ ఈ ప్రాంతంలో గత 30 ఏళ్ళు గా నివసిస్తునటువంటి పేద కుటుంబాలకు చెందినవారు ఉన్నందున వారిని దృష్టిలో పెట్టుకుని ఫ్లైఓవర్ పనులను 30 మీటర్ల వరకు మాత్రమే కుదించి భూసేకరణ చేపట్టి ఫ్లైఓవర్ నిర్మాణం ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలని అలాగే తారానగర్ మార్కెట్ మెయిన్ రోడ్డు ను 80 ఫీట్ లకు కుదించి మెయిన్ రోడ్డు అభివృద్ధి పరచాలని కమిషనర్ కీ వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. సీఎంసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా సైబరాబాద్ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధిపై సైబరాబాద్ కమీషనర్ సృజన దృష్టి సారించిన్నట్లు మాజీ కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సోమదాస్, సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

## సి ఎం ఎస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన రాగం నాగేందర్ యాదవ్




శేరిలింగంపల్లి నేటి శుభోదయ..:సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ జి.సృజన ఐ ఎ ఎస్ ని సైబరాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే ఇచ్చి సత్కరించిన శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ శేరిలింగంపల్లి డివిజన్ లో నూతనంగా నిర్మాణం చేపట్టబోయే ఫ్లైఓవర్ అభివృద్ధి వలన రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని.. కానీ ఈ ప్రాంతంలో గత 30 ఏళ్ళు గా నివసిస్తునటువంటి పేద కుటుంబాలకు చెందినవారు ఉన్నందున వారిని దృష్టిలో పెట్టుకుని ఫ్లైఓవర్ పనులను 30 మీటర్ల వరకు మాత్రమే కుదించి భూసేకరణ చేపట్టి ఫ్లైఓవర్ నిర్మాణం ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలని అలాగే తారానగర్ మార్కెట్ మెయిన్ రోడ్డు ను 80 ఫీట్ లకు కుదించి మెయిన్ రోడ్డు అభివృద్ధి పరచాలని కమిషనర్ కీ వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. సీఎంసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా సైబరాబాద్ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధిపై సైబరాబాద్ కమీషనర్ సృజన దృష్టి సారించిన్నట్లు మాజీ కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సోమదాస్, సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

**ప్లాస్టాసురుడికి 10 ప్లాస్టిక్ వస్తువులు ఇచ్చి, మొక్కను తీసుకెళ్లండి**

**డిసిసి అధ్యక్షులు ఇనగాల**




వరంగల్ ప్రతినిధి : ఏప్రిల్ 21 నేటి శుభోదయ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రీరామ్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏపీ) మరియు 104.8 ఎఫ్ఎం, మీ ఎఫ్ఎం వరంగల్ సంయుక్తంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. మంగళవారం మడికొండలోని 'ఈనాడు' కార్యాలయంలో నిర్వహించిన ఈ అద్భుత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి హాజరైయ్యారు.ఈ నేపథ్యంలో "ప్లాస్టాసురుడు" అనే థీమ్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజలు తమ వద్ద ఉన్న 10 ప్లాస్టిక్ వస్తువులను ప్లాస్టాసురుడికి సమర్పించి, ప్రతిఫలంగా ఒక మొక్కను ఉచితంగా పొందారు.ఈ వినూత్న పద్ధతి ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పచ్చదనాన్ని పెంచవచ్చని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ నేడు ధరిత్రి దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని,ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ మరియు మీ ఎఫ్ఎం టీమ్ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమని, ప్రతి ఒక్కరూ ఈ స్ఫూర్తితో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, మొక్కలు నాటాలి" అని పిలుపునిచ్చారు.హనుమకొండ ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలి" అని కోరారు.ఈ కార్యక్రమంలో ఈనాడు ప్రతినిధులు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సభ్యులు, మీ ఎఫ్ఎం టీమ్ మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు

### విజయవంతం కావడంలో సాంస్కృతిక సారథి కళాబృందం పాత్ర కీలకం

**జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువతను అప్రమత్తం చేయడంలో జిల్లా పోలీసు శాఖతో కలిసి పనిచేయాలి.**




సంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా (ఏప్రిల్ 13-18) వారం రోజుల పాటు నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు విజయవంతం కావడంలో సంగారెడ్డి జిల్లా సాంస్కృతిక సారథి కళాబృందం కీలక పాత్ర పోషించిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. వారి సేవలను గుర్తిస్తూ, అభినందిస్తూ ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆన్లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ప్రజలను చైతన్యం చేయడంలో సాంస్కృతిక సారథి కళాబృందం చేస్తున్న కృషి అభినందనీయమని, ఇదే విధంగా జిల్లా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, వారి భవిష్యత్తుపై దృష్టి సారించేలా మరిన్ని స్కిట్లు, పాటల ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు సునిల్ కుమార్, రమేష్, ఎ.కే. బిక్షపతి, రవీందర్, సంధ్య, స్వప్న, శశిప్రియ, మల్లేష్, సాయిలు, దుర్గేష్, వినేశ్, ఆగమయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలి

**-వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి లెనిన్ డిమాండ్**



ఏన్కూర్, నేటి శుభోదయ::తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు ఏన్కూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్చార్జి ఎంపీడీవో కృష్ణ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏన్కూర్ వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి ఇటికా ల లెనిన్ మాట్లాడుతూ.... ఎర్రటి ఎండలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనికి తగ్గ వేతనం రావట్లేదు అని వెంటనే వేతనాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుంద ని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జి రాంజీ బిల్లును వెంటనే రద్దు చేయాలని లేదంటే ఉపాధి హామీ కూలీల తో కలిసి కలెక్టర్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదని పని ప్రదేశంలో ఉపాధి కూలీలు మరణిస్తే ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ కమిటీ సభ్యులు దొంతబోయిన నాగేశ్వరరావు, కుటుంబరావు, జొన్నలగడ్డ బాబు ,మద్దెల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## జూన్ 2 లోపు 50% ఫిట్మెంట్తో పిఆర్సి ప్రకటించకుంటే భారీ ఉద్యమాన్ని నిర్మిస్తాం

**ఉద్యోగులు కూడా ప్రజల్లో భాగమే**

**పి ఆర్ టి యు టి ఎస్ అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి**




నేటి శుభోదయ:పి ఆర్ టి యు వర్ధల్ మండల శాఖ ఆధ్వర్యంలో నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైలారం ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ అభినందన సభకు వర్గల్ మండల శాఖ అధ్యక్షులు తోకల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించగా మండల ప్రధాన కార్యదర్శి పారుపల్లి నరసింహ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పిఆర్టియుటిఎస్ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మేనిఫెస్టోలో చేర్చిన విధంగా 50% ఫిట్మెంట్తో జూన్ రెండు లోపు పిఆర్సి ప్రకటించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మిస్తామని వంగ మహేందర్ రెడ్డి అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వమిచ్చే బహుమానం కాదని సానుభూతితో ఇచ్చేది కాదని పెరుగుతున్న ధరల ప్రకారం పి ఆర్ సి పొందడం ఉద్యోగుల హక్కు అని ఆరు నెలల లోపు ప్రభుత్వం రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్నారని ఉద్యోగులుకూడా ప్రజలలో భాగమేనని సంక్షేమ పథకాలకు రాని నిధుల కొరత ఉద్యోగులకు ఇచ్చే పి ఆర్ సి కి ఎందుకు వస్తుందని ప్రభుత్వం చిత్త శుద్ధితో పిఆర్సి ఇవ్వాలనుకుంటే చాలా అవకాశాలు ఉన్నాయని జూన్ రెండు లోపు పిఆర్సి ప్రకటించకుంటే ఉద్యోగ ఉపాధ్యాయుల ఆగ్రహాన్ని ప్రభుత్వం చూడాల్సివస్తుందని పి ఆర్ టి యు టి ఎస్ అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి అన్నారు. సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి మూడు దశాబ్దాల పాట ఒక ఉత్తమ ఉపాధ్యాయునిగా ఉత్తమ ప్రధానోపాధ్యాయినిగా అంకిత భావంతో సేవలందించారని వారి ఉద్యోగ జీవితం వారి విధి నిర్వహణలో నిబద్ధత నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శమని మహేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి ఆర్ టి మాజీ డైరెక్టర్ ఆనంద్ కిషోర్ పిఆర్టియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాయు పల్లి శశిధర్ వర్గల్ మండలం మాజీ ఎంపీపీ నిమ్మ రంగారెడ్డి సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి సేవలను కొనియాడారు. ఎంఈఓ కే సునీత ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి కరీముద్దీన్ పత్రిక సంపాదకవర్గ సభ్యులు పిన్నింటి రామకృష్ణా రెడ్డి , లక్కిరెడ్డి విజయ మాజీ అధ్యక్షులు ఎం భాస్కర్ రెడ్డి సుబ్రహ్మణ్యేశ్వ రెడ్డి స్నేహితులు రాచకొండ డిసిపి శ్రీనివాస్ శ్రీమతి రజిత తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల శాఖ అధ్యక్షులు తోకల చంద్రశేఖర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ గౌడ్ కృష్ణ సౌజన్య రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు సుభాష్ చంద్ర రెడ్డి వెంకటేశ్వర్లు ,తిరుపతి రెడ్డి , మల్లికార్జున స్వామిమండల నాయకులు శ్రీపాల్ రెడ్డి,శ్రీనివాసరావు, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ చౌక్ లో ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమము

**మున్సిపల్ చైర్మెన్ ఓడ్నాల శ్రీనివాస్**




మంథని, ఏప్రిల్-21, నేటి శుభోదయ:మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యములో మంథని పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద వేసవి కాలం దృష్టిలో ఉంచుకోని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా రహదారులపై వెళ్లే ప్రయాణికులు, కార్మికులు, వృద్ధులకు, ప్రజలకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ...వేసవి కాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి , పాలక వర్గ సభ్యులు మద్దికట్ల స్రవంతి, ఎల్లెంకి వంశీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగల సమస్యతో ఇబ్బందులు పడుతున్న గల్లీ వాసులు



నారాయణఖేడ్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి: ఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండల కేంద్రంలోని పెద్దబాయి గల్లీలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ మృత్యుపాశాలుగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ వీధిలో ప్రజలు, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండగా తీగలు చాలా తక్కువ ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని మండిపడుతూ వెంటనే స్పందించి ఈ ప్రమాదకర తీగలను సరిచేయాలని, పెను ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి:ఖేడ్ నియోజకవర్గం మానుర్ మండలం తుమ్నూర్ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ దేశాలు గర్వించదగ్గ మహానుభావుడని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం లభిస్తున్నాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, ముఖ్యంగా యువత విద్య ద్వారా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇది రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ గ్రామ సర్పంచ్, దత్తు బిరధర్ మానూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, మోహన్ రెడ్డి, హన్మయ్య, భారత్, శ్రీశైలం, వివిధ గ్రామాల సర్పంచులు, బ్రహ్మానంద్ రెడ్డి మాజీ సర్పంచ్, విగ్రహ దాత, స్థానిక ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్ సంఘం సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## బోరంచ గ్రామానికి చెందిన పోచయ్య కొత్త బైక్ సర్వీస్ సెంటర్ ప్రారంభం



నారాయణఖేడ్ ఏప్రిల్ 20 నేటి శుభోదయ ప్రతినిధి:నారాయణఖేడ్ పట్టణంలో సోమవారం బోరంచ గ్రామానికి చెందిన పోచయ్య ఆధ్వర్యంలో నూతనంగా "శ్రీ మణికంఠ మోటార్స్" మల్టీ బ్రాండ్ బైక్ సర్వీస్ సెంటర్ మరియు వాషింగ్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బోరంచ గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించి, పోచయ్య మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## పాండురంగ గుడి నిర్మాణానికి భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ పోశెట్టి జ్యోతి భూపాల్



నారాయణఖేడ్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి:నారాయణఖేడ్ మండలం సంజీవన్ రావుపెట్ గ్రామంలో మంగళవారం ఉదయం 11:00 గంటలకు ఎల్లమ్మ కాలనీలో శ్రీ పాండురంగ గుడి నిర్మాణానికి భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ పోశెట్టి జ్యోతి భూపాల్ ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోసిట్టి జ్యోతి భూపాల్ మాట్లాడుతూ... శ్రీ పాండురంగ గుడి నిర్మాణానికి గ్రామస్తులందరూ కలిసికట్టుగా సహకరించి గుడి నిర్మించడానికి అందరూ తమ వంతుగా సహకరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూమయ్య,ఆలయ ప్రధాన అర్చకుడు నాగనాథ్ పంతులు, పంచాయతీ కార్యదర్శి సురేష్ రావు, గ్రామ పెద్దలు శంకర్ రావు, భూమ్ రెడ్డి, సత్తయ్య జి రాములు తదితర గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రవాణా సేవలు కొనసాగించేందుకు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం



నారాయణఖేడ్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి:ఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని రాష్ట్ర రహదారి రవాణా సంస్థ కార్యాలయంలో మంగళవారం డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటన విడుదల చేస్తూ, నారాయణఖేడ్ డిపో పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు 22-04-2026 నుండి సమ్మెకు వెళ్లనున్న నేపథ్యంలో సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలను కొనసాగించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో తాత్కాలికంగా టికెట్ పరిశీలకులుగా విధులు నిర్వహించడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులను ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి గల వారు తమ పదవ తరగతి ఉత్తీర్ణత ధృవపత్రాల అసలు ప్రతులతో కలిసి 22-04-2026 ఉదయం నారాయణఖేడ్ డిపోకు హాజరై డిపో మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు నిరంతర రవాణా సౌకర్యం అందించడమే లక్ష్యమని, దీనికి స్థానికుల సహకారం అవసరమని ఆయన అన్నారు.

## అంబేద్కర్ సిద్ధాంతా లే నేటి సమాజానికి మార్గదర్శకం

విజయపాల్ రెడ్డి



నారాయణఖేడ్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి: ఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మాజీ శాసన సభ్యుడు విజయపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పెద్దచిన్న, ఎక్కువతక్కువ అనే తేడాలు లేకుండా సమాజాన్ని సమానత్వంతో ముందుకు నడిపించిన మహనీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. భిన్నమైన భాషలు, సంస్కృతులు ఉన్న ప్రపంచంలో సమాన హక్కుల కోసం కృషి చేసి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మార్గం చూపిన నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టిన మహనీయుడు సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరి కృషి అని అన్నారు.

# ఎంపిటీసి, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

**సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం లో కార్యకర్తలకు, నాయకులకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపు**

**మహిళా బిల్లు విషయం లో బీజేపీ చేసిన కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లండి. డిసిసి అధ్యక్షురాలు, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**



సంగారెడ్డి ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి: సంగారెడ్డి పట్టణం లోని ఓ ప్రైవేట్ హోటల్ లో మంగళవారం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యం లో జరిగిన ఈ సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి తో పాటు జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ , మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు, పఠాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం , పార్టీ కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తేనే విజయం సాధిస్తామని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచామని, మున్సిపల్ ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. అయినప్పటికీ జిల్లాలో ఇంకా నాయకుల మధ్య సమన్వయం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాల ను చేపట్టినా, ఆ సందేశాన్ని, స్ఫూర్తి ని ప్రజల్లోకి తీసుకెళ్ళా ల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తల పైనే ఉంటుందన్నారు. కార్యకర్తల కు సముచిత స్థానం ఇవ్వాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుండే సన్నద్ధం కావాలి, పార్టీ నాయకుల మధ్య వర్గ పోరు ఉండొద్ద న్నారు. నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండటం సహజమే.. కానీ వర్గ పోరు వల్ల పార్టీ కి నష్టం జరుగుతుందన్నారు. డెబ్బై వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఇప్పటివరకు కేవలం ఆరోగ్య శాఖ లోనే దాదాపు ఇరవై వేల ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు.లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలు ను రైతు బంధు రూపం లో రైతులకు అందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని గ్రామగ్రామాన విజయవంతంగా అమలవుతోందన్నారు . నలభై ఆరు లక్షల మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టామని, దేశం లో ఎక్కడా లేనివిధంగా డిజిటల్ హెల్త్ కార్డ్ లు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జహీరాబాద్, నారాయణ్ ఖేడ్ ఆసుపత్రులలో మరో 50 పడకలు అదనంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి మెడికల్ కళాశాల లో భవిష్యత్తు లో పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నరు. సింగూరు ప్రాజెక్టు ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. 200 కోట్లతో సింగూరు ప్రాజెక్టు ను టూరిజం స్పాట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వం ముందుకెళ్తోంది అని అన్నారు. మహిళా బిల్లు కు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సెపరేట్ గా బిల్లు పెడితే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. డీలిమిటేషన్ ఉన్నా లేకున్నా మరోసారి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలునిచ్చారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా గెలిచాం, మన బలాబలాలు , లోపాల పై చర్చించుకోవాలి అన్నారు. వచ్చే ఎంపీ టీ సి , జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయం లో చర్చ జరగాలన్నారు. మూడేళ్ల కు పైగా మండలస్థాయి లో పనిచేసిన వారికి, జిల్లా స్థాయి లో పదవులు ఇచ్చి, వారి స్థానం లో మండలం లో కొత్తవారిని నియమించాలని సూచించారు. ప్రభుత్వం ఉన్నది కాబట్టి అభ్యర్థుల ఎంపిక లో పోటీ ఉందని, మన మధ్యే మనకే పోటీ వల్ల పార్టీ కి నష్ట జరుగుతుందన్నారు.మొన్న పార్లమెంట్ లో జరిగిన పరిణామాల ను, ఎందుకు మహిళా బిల్లు ను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందో , మహిళా బిల్లు విషయం లో బీజేపీ కుట్ర లను సైతం పార్టీ పరంగా చర్చ జరగాలి, ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ మాట్లాడుతూ మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 70% మంది సర్పంచ్ లు గా గెలిచారన్నారు. నాయకుల మధ్య సమన్వయం ఉం డాలి, అన్ని నియోజకవర్గాల్లో సమన్వయం తో పని చేయా లని పిలుపునిచ్చారు. దేశం లో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రం లో సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, సన్న బియ్యం, ఇందిరమ్మ గృహ పథకాల పట్ల ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం రైతు బంధు ను కొనసాగిస్తుంది అని వివరించారు. రాష్ట్రం లో ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసే విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టబోతుందన్నారు.వచ్చే ఎన్నికల్లో నూ కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని తెలిపారు. నీలం మధు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రం లో జరిగిన కుల గణన ఆధారంగా వచ్చే ఎన్నికల్లో అన్ని కులాల కు సమ ప్రాధాన్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్పర్సన్ సునీతా పాటిల్, పిసీసి ప్రధాన కార్యదర్శులు తోపాజి అనంత్ కిషన్, చిన్నా ముదిరాజ్, నాయకులు శశికళా యాదవ్ రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారయణ, కొహీర్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ప్రమాదాల నివారణకు చర్యలు

ఖమ్మం, నేటి శుభోదయ ::: ట్రాఫిక్ ఎస్సై రవికుమార్ తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తుండగా ఒక టీవీఎస్ బైక్ టిజి 29 ఏ 6533 కలది డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే దగ్గరకు రాగానే, ట్రాఫిక్ సిబ్బంది ఆపగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే కానిస్టేబుల్ ని ఢీ కొన్న వెంటనే ట్రాఫిక్ సిబ్బంది వారి యొక్క బైక్ కాగితాలు అడిగి, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయటం గురించి అడగగా వారు ట్రాఫిక్ సిబ్బంది వద్ద బైక్ వదిలేసి అక్కడి నుండి పారిపోయారు. వెంటనే ట్రాఫిక్ ఎస్ఐ అట్టి బండి యొక్క వివరాలు, ఓనర్ నెంబర్ తీసుకొని వారిని కాంటాక్ట్ చేయగా వారు తమ యొక్క బైకు ఏప్రిల్ నెలలో దొంగతనం జరిగిందని అట్టి విషయమై ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగిందని దానికి సంబంధించి క్రైం నెంబర్ 139/2026 తేదీ.18.04.2026 నందు ఎఫ్ఐఆర్ గా నమోదు చేయబడిందని తెలిపారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఇట్టి విషయం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కు తెలియజేసి దొంగతనం జరిగిన బైకును వన్ టౌన్ పోలీస్ వారికి తదుపరి చర్య నిమిత్తం అప్పగించారు.ఇదేవిధంగా సుమారు పది రోజుల క్రితం ట్రాఫిక్ ఎస్ఐ జి సాగర్ , ఖమ్మం ట్రాఫిక్ సిఐ నెంబర్ ప్లేట్ లేని వెహికల్ గురించి స్పెషల్ డ్రైవ్ చేస్తుండగా రెండు దొంగిలించబడిన బైకులు దొరకగా వాటిని ఖమ్మం సిసిఎస్ వారికి అప్పగించారు. గత సంవత్సరం కాలం నుండి ట్రాఫిక్ వారు నెంబర్ ప్లేట్ స్పెషల్ డ్రైవ్ లో, డ్రంకెన్ డ్రైవ్ లో సుమారు 15 బైకులు దొంగతనం చేయబడినవి రికవరీ చేసి వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు నుండి బాధితులకు అప్పగించడం జరిగింది.

## జనాభా గణనకి మరొకసారి రంగం సిద్ధంకి అవగాహన శిక్షణ

**16వ సారి భారతదేశం జనాభా గణనకి పూనుకుంది**

**మన తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా 2027 జనాభా గణన**



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి ఏప్రిల్ 21:యాచారం మండల కేంద్రంలోని పుడమి పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించడం జరిగింది.ఈ జనాభా గణన దేశంలో 16వ సారి మన తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత మొదటిసారి.2027 జనాభా గణన దేశ అభివృద్ధికి కీలకమైన మహత్తర కార్యక్రమం. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు సూపర్వైజర్లుముఖ్యపాత్ర పోషిస్తారు. వీరికి సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా గణన సక్రమంగా,ఖచ్చితంగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో శిక్షణ కార్యక్రమం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.,శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం గణనలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు అందించడం. జనాభా గణనలో ఉపయోగించే ఫార్మ్‌లు, మొబైల్ యాప్‌లు, డిజిటల్ పద్ధతులు, ప్రశ్నావళి నిర్వహణ వంటి అంశాలను స్పష్టంగా వివరించడం ఇందులో భాగం. అలాగే ప్రజలతో ఎలా మాట్లాడాలి, వారి నుండి సరైన సమాచారం ఎలా సేకరించాలి వంటి విషయాల్లో మార్గదర్శకాలు ఇవ్వబడతాయి. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే బాధ్యతను నిర్వర్తిస్తారు. అందుకే వారికి కమ్యూనికేషన్ స్కిల్స్, సహనం, బాధ్యత భావం చాలా అవసరం. సూపర్వైజర్లు అయితే ఈ ప్రక్రియను పర్యవేక్షించి, సిబ్బంది పనిని సమర్థంగా నిర్వహించేలా చూసుకుంటారు. శిక్షణలో వీరికి నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార పద్ధతులు, నివేదికల తయారీ వంటి అంశాలు నేర్పించారు.శిక్షణ కార్యక్రమంలో ప్రాక్టికల్ సెషన్స్ కూడా ముఖ్యమైనవి. మాక్ సర్వేలు నిర్వహించడం ద్వారా నిజ జీవిత పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించడం జరిగింది.. సాంకేతిక సమస్యలు, డేటా ఎంట్రీలో పొరపాట్లు జరిగితే వాటిని ఎలా సరిదిద్దాలో కూడా వివరంగా చెప్పబడింది.ఇలాంటి సమగ్ర శిక్షణ కార్యక్రమం ద్వారా ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలుగుతారు. దీని ఫలితంగా 2027 జనాభా గణన ఖచ్చితంగా, విశ్వసనీయంగా పూర్తవుతుంది. సరైన గణాంకాలు ప్రభుత్వానికి ప్రణాళికలు రూపొందించడంలో, ప్రజల అభివృద్ధికి కీలకంగా ఉపయోగపడతాయి.మొత్తానికి, శిక్షణ కార్యక్రమం జనాభా గణన విజయానికి పునాది వంటిది. సరైన శిక్షణతోనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని సెన్సెస్ ఫీల్డ్ ట్రైనర్ డాక్టర్ వరకాల పరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ కవిత సందీప్ టెక్నికల్ అసిస్టెంట్ శిక్షణార్థుల చేత జనాభా గణన ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ట్రైనర్ సోలోమాన్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ హిత చర్యలతోనే భవిష్యత్ సురక్షితం జిల్లా: కలెక్టర్ ప్రావీణ్య




సంగారెడ్డి ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి:అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సందర్భంగా "99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భూమిని కాపాడుకోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరమన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత వస్తువులను వినియోగించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను కాపాడుకోవడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని, అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అనంతసాగర్ గ్రామానికి చెందిన ఐకేపీ వివోఏ కు విధుల నుండి తొలగింపు

**- వివోఎ,గా తొలగించిన విషయంలో ఖేడ్ సబ్ సబ్ కలెక్టర్ కి వినతి**



నారాయణఖేడ్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి:నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన ఐకేపీ వివో కొండ సాయిలు తనను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గత ఏడాది మే నెలలో అకారణంగా పదవి నుండి తొలగించారని ఆరోపిస్తూ మంగళవారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతికి వినతి పత్రం సమర్పించారు. తనపై ఎలాంటి తప్పులు లేకపోయినా విచారణ లేకుండా తొలగించారని, గ్రామ సమైక్య సంఘ సమావేశం కూడా నిర్వహించలేదని తెలిపారు. ఈ విషయంలో అధికారులను ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని, గత ఏడాది నుంచి తిరుగుతున్నప్పటికీ తన సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల మద్దతు తనకు ఉందని పేర్కొంటూ పూర్తి స్థాయి విచారణ జరిపి తిరిగి వివోగా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను సాయిలు కోరుతున్నారు.

## జిల్లాలో సదాశివపేట పట్టణానికి స్త్రీ నిధి ఉత్తమ అవార్డు



సదాశివపేట ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి: సదాశివపేట పట్టణానికి స్త్రీనిధి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రుణాల మంజూరు మరియు నాణ్యమైన రికవరీతోపాటు 100% పారదర్శకతతో ఉన్నందున సదాశివపేట పట్టణానికి ఉత్తమ అవార్డు దక్కింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు అవసరమైన వారికి 100% రుణాలు మంజూరు చేయాలని దానితోపాటు రికవరీ కూడా 100% అయ్యే విధంగా చూడాలని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్, శ్రీనిధి ఆర్‌ఎం, శ్రీనిధి మేనేజర్, డిఎంసి, మెప్మా అధికారులు, ఆర్పీలు, ఓబిలు, పాల్గొనడం జరిగింది.కమీషనర్ సదాశివపేట పురపాలక సంఘం

## మహిళా కళాశాలలో అలయ్ బలయ్




ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ విద్యార్థినిల ఫ్రెషర్స్, ఫెరెవెల్ కలిపి అలయ్ బలయ్ వేడుకలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యం చేసి పాటలు పాడారు. ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి మాట్లాడుతు వచ్చే విద్యా సంవత్సరం నుండి కళాశాల స్వయం ప్రతిపత్తి సాధించిన విషయాన్ని గుర్తు చేస్తూ కళాశాలకు రెగ్యులర్ గా రావాలని కోరారు. తద్వారా మంచి భవిష్యత్ నిర్మించుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అభిలాషించారు. ఈ వేడుకలలో వైస్ ప్రిన్సిపాల్ జానకి రామారావు, అధ్యాపకులు రమేష్, వెంకటేశ్వర్లు, బొంద్యాలు, రవి శంకర్, ప్రవీణ్, రమాదేవి, సావిత్రి, శ్రీనివాస్ రావు, రామారావు, మల్లేశం, సూర్యలక్ష్మి, గాయత్రి, సింధు, రాజేష్, చరిత్ర పాల్గొన్నారు.



## పేదల పెన్నిధి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**- ర్యాకల వీరేశం.**



సదాశివపేట ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి :ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు చింత సాయినాథ్ తో కలిసి ర్యాకల వీరేశం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు పూలమాల వేసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ర్యాకల వీరేశం మాట్లాడుతూ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి, అన్నా అంటే నేనున్నా అని, పేదల పెన్నిధి, ప్రజాసేవయే తన కర్తవ్యంగా భావించే నాయకుడు చింత ప్రభాకర్ అని అన్నారు.

# ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసిన

### మల్లి బాబు యాదవ్, సర్పంచ్ రమాదేవి

### – కొలిక్కిరాని రుక్కితండా గ్రామపంచాయతీ భవననిర్మాణం పై వినతి పత్రం



కామేపల్లి, నేటి శుభోదయ ::: కామేపల్లి మండలం రుక్కి తండా గ్రామపంచాయతీ భవన నిర్మాణం అధికారుల నిర్లక్ష్యం వలన నిర్మాణ దశలోనే ఆగిపోయిందని, దీనిపై ఎండిఓ కార్యాలయం ఎదుటశనివారం ఆందోళన కార్యక్రమం చేపట్టినప్పటికీ, అనేకసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ, ఎలాంటి స్పందన లేదని, అధికారులు కాంట్రాక్టర్ తో కుమ్మక్కై వ్యవహారాన్ని పక్కన పెడుతున్నారని మంగళవారం నాడు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు, ఎండిఓ రవీందర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని, దీనిపై సోమవారం గ్రీవెన్స్ లోకూడా ఫిర్యాదు చేయడం జరిగిందని, సమస్య పరిష్కారం కాకున్నట్లయితే పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ను కూడా కలిసి ఫిర్యాదు చేస్తామని, అధికారులపై చర్యలు తీసుకొని, గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించాలని, లేకున్నట్లయితే కాంట్రాక్టర్ తీసుకున్న 3 లక్షల 75000 రూపాయలను తిరిగి చెల్లించాలని రుక్కి తండా గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ రమాదేవి, కామేపల్లి మాజీ జడ్పీటీసీ మేకల మల్లిబాబు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు, ఎండిఓ రవీందర్ కు గ్రామ పంచాయతీ భవనం విషయంలో తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించిన తర్వాత వారు మాట్లాడుతూ నాటి పంచాయతీ సెక్రటరీ రాజేష్, పి ఆర్ ఏ ఈ వాసు కాంట్రాక్టర్ తో కుమ్మక్కై భూదాన యజమానితో ఎలాంటి అగ్రిమెంటు గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా చక చక బేస్ మెంట్ లెవెల్ కట్టించి డబ్బులు ట్రెజరీ నుండి డ్రా చేయించడం జరిగిందని, భవనం పూర్తి చేయకుండా దానిని నిర్లక్ష్యంగా వదిలేసారని, ఈ విషయమై ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడంలేదని, ఈ విషయంలో ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉన్నదేమోనని అనుమానంగా ఉందని ఎమ్మెల్యేకు విన్నవించగా వారు స్పందించి గ్రామపంచాయతీ భవనం నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటానని, త్వరలో గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. . చర్యలు తీసుకోకుండా ఉన్నట్లయితే తెలంగాణ రాష్ట్ర పంచాయతీ కమిషనర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని, తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పర్మిశెట్టి సాంబయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు గుగులోతు మంగ్య, గుగులోతు కిషన్, ఉబ్బని నాగార్జున కురుసం రామ్మూర్తి, కురసం రవి చిన్నబోయిన వీరబాబు, లాకావత్ నరేష్ మేకల మల్లికార్జునరావు ముత్తబోయిన సత్యనారాయణ కానబోయిన బిక్షం, చల్ల రవి మరియు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ సదాశివపేటలో 202627 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి



సదాశివపేట ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి :ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి దోస్త్ (డిగ్రీ ఆన్లైన్ సర్వీస్ తెలంగాణద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రథమ ఎంపికగా గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ సదాశివపేటను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు: ఈ కోర్సుల ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులు చదువుకుంటూనే ఉపాధి అవకాశాలు పొందే విధంగా రూపకల్పన చేయడం. అకాడమిక్ విద్యను పరిశ్రమలతో అనుసంధానం చేసి ఈ కోర్సులను రూపొందించారు. ఈ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు స్టైపెండ్ కూడా అందించబడుతుంది. కోర్సు పూర్తయిన తర్వాత అదే సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి.ప్రస్తుతం ఋూూ ప్రక్రియ కొనసాగుతోంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మంచి పాస్ శాతం ఉన్న ఈ కళాశాలను ఫస్ట్ ఆప్షన్‌గా ఎంపిక చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.కళాశాలలో విశాలమైన తరగతి గదులు, సువిశాల క్రీడామైదానం, పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం, రోడ్డు సౌకర్యం, బస్సు పాస్ సదుపాయం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, మెరిట్ స్కాలర్షిప్‌లు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యార్థులు తమ చదువును కొనసాగించవచ్చు.అందువల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు కళాశాలను సందర్శించి, అందుబాటులో ఉన్న కోర్సుల్లో తమ పిల్లలను చేర్పించాలని ప్రిన్సిపల్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ఆపదలో ఉన్న వారికి చేయూత సిఎంఆర్ఎఫ్

### – సిఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ



ఖమ్మం, నేటి శుభోదయ ::: స్థానిక 46వ డివిజన్ పరిధిలోని సారధి నగర్ కు చెందిన సిఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారులైన జాడ మంగ లక్ష్మి కి రూ 26,500/-, మేదరమెట్ల జ్యోతి కి రూ 20,000/-, నిమ్మల సాయిలక్ష్మి రూ 25,500/- విలువ గల సిఎం ఆర్ ఎఫ్ చెక్కులను కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న వారికి ఆర్థిక సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ॥72,000/- మంజూరు చేయించడం జరిగిందని, పేద ప్రజలకు సాయం అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ప్రజా సంక్షేమమే మంత్రి తుమ్మల అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు తెలిపారు. ఖమ్మం నియోజకవర్గం లో ప్రజా సంక్షేమానికి తుమ్మల నాగేశ్వర రావు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు తెలిపారు. పేద ప్రజలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జి, నగర ఓబిసి అధ్యక్షులు బాణాల లక్ష్మణ్,నగర కార్యదర్శి దేవర వెంకన్న, నాయకులు తొగరు భాస్కర్, దయ్యాల నాగేశ్వరరావు, కన్నం రమేష్, ఎమ్మే రామకృష్ణ, గోనెల రవిశంకర్, కాటం యాదయ్య, సెల్వం జ్ఞానేశ్వర్ , సింగం అంజయ్య, మన్నె హరికృష్ణ, హనుమాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ 2026 ఆల్ ఇండియా ర్యాంకుల ఫలితాలలో రెజొనెన్స్ ప్రభంజనం



ఖమ్మం, నేటి శుభోదయ ::: దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ - 2026 ఫలితాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి తమ అధిక్యాన్ని చాటుకొన్నారని డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్రకుమార్ , కె. శ్రీధర్రావు తెలిపారు. ఎల్.రామ్ మోహన్ రెడ్డి 99.12, ఎం. మోక్షిత 97.25, ఎండి నిఖత్ 96.53, వి. లహరి 95.46, జి.భరత్ చంద్ర 93.76, ఎల్. శ్రీ వర్షిణి 93.61, బి. మేఘనాథ్ 92,67, బి. హేమంత్ 90.11, వంటి పర్సంటైల్ సాధించారని తెలిపారు .జేఈఈ మెయిన్స్ లో వివిధ కేటగిరీలలో ఆల్ ఇండియా ర్యాంకు సి.హెచ్. యశ్విత 885, కె. అఖిల్ 959, శ్రీవర్షిణి 967, పి. జోషిత 1173, మేఘనాథ్ 1178,డి. సంతోష్ 1654, ఎల్. రామ్మోహన్ రెడ్డి 1832, ఐ. శ్రీరామ్ 3450, డి. జగదీష్ 4346, బి. అనిల్ 5991, డి. కీర్తన 8190,బి. సాయితేజ 9108, వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు సుమారు 132 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ కు అర్హత సాధించారని పేర్కొన్నారు. పరీక్షా విధానం మారినప్పటికి రెజొనెన్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని, ఇంతటి ఘనవిజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, భోదనానుభవం కలిగిన మేనేజ్మెంట్ ఈ విజయానికి కారణమని తెలిజయజేస్తూ, ఇంటర్ తో పాటే జేఈఈ మెయిన్స్, ఐఐటీ , ఎంసెట్, నీట్ , బిట్శాట్ వంటి అన్ని జాతీయ పరీక్షకు తగు శిక్షణ నివ్వడం వలన ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. సాధారణ విద్యార్థులతో సైతం, అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. స్కూల్ స్థాయిలో ఐఐటీ ఫౌండేషన్ కల్గిన విద్యార్థులతో పాటే, ఇతర విద్యార్థులకు కూడా మంచి ర్యాంకులు సాధించామని వారు తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సతీష్ , భాస్కరెడ్డి , అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ముందుంది గుంపు మేస్త్రి హైడ్రా కమిషనర్ సంగతి

### మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక స్పీచ్ కు విలవిలలాడుతున్న రేవంత్ రెడ్డి సర్కార్. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం: ఎస్ వెంకటేష్.



రాజేంద్రనగర్,ఏప్రిల్21(నేటి శుభోదయ):రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ లో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్,మైలార్దెవపల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగినది.హైడ్రా అంటే పేదల ఇండ్లను కూల్చుడేనా? రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..వచ్చిన మొదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తాం..జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్..వెల్లడించిన శుభ సందర్భంగా రెండు డివిజన్ నాయకులు కార్యకర్తలు కోలహాలంగా కేసీఆర్ చిత్రపటానికి ఘనముగా పాలాభిషేకం చేయడం జరిగినది.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..రాజేంద్రనగర్ నియోజకవర్గం పరివాహక ప్రాంతంలో మూసి సుందరీకరణ డ్రామాతో పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేతల పై నిరంతర పోరాటం సాగించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తనదైన శైలిలో ప్రజా పక్షాన నిలిచిన తీరు యావత్ తెలంగాణ అబ్బురపరిచేలా ఉన్నది..వారి పోరాట పటిమకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొదలుకొని సబితా ఇంద్రా రెడ్డి గారు హరీష్ రావు అనేక దఫాలుగా పర్యటించి మూసీ పరివాహక ప్రాంతము లో పేదల ఇళ్లను కూల్చివేసే హైడ్రా ను అడ్డుకున్న తీరు హర్షణీయం అని కొనియాడారు.ఈ సందర్భంగా ఇదే విషయంపై నిన్న జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైడ్రా పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ..బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే మొదటి సంతకంతోనే హైడ్రాని ఎత్తి అవతల పడేస్తం.పేదల ఇండ్లు కూల్చుడేనా హైడ్రా పని? మేము అధికారంలోకి ఉన్నప్పుడు 3.5 లక్షల పేదల కుటుంబాలకు పట్టాలు ఇచ్చినం.ఇప్పుడేమో కనీసం పిల్లల పుస్తకాలు కూడా తీసుకోనివ్వకుండా ఇండ్లు కూలుస్తున్నారు.భూములు కబ్జా చేయడానికి మూసీ నది దగ్గరున్న పేదల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు..హైడ్రా అంటే పేదల కొంపలను కూల్చుడేనా,.రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..వచ్చిన మొదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తాం! మూసీ పేరుతో 15 వేల పేదల ఇండ్లు కూలగొడతారా ఇదంతా భూములు కబ్జా పెట్టి రియల్ ఎస్టేట్ దందా,దోపిడీ కోసమే అని కెసిఆర్ అని వెంకటేష్ తెలిపారు.కెసిఆర్ మాటలు యావత్ తెలంగాణ ప్రజానీకము సంతోషం వ్యక్తపరుస్తూ ఉందని కొనియాడుతూ రాబోయే రోజుల్లో హైడ్రా నుంచి విముక్తి కలుగుతుందని భావిస్తూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పేదల పక్షంన నిలిచిన కేసీఆర్ కు కృతజ్ఞతా భావంగా పాలాభిషేకం చేయటం జరిగిందని వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ మైలర్ దేవ్ పల్లి పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్,రమేష్ ముదిరాజ్,అక్కెం రాఘవేందర్ యాదవ్,రాజేష్ యాదవ్,సరిత మహేష్,తిరుపతి రెడ్డి, యాదయ్య, కొంపల్లి జగదీష్, వెంకటరమణ, మైసిరెడ్డి, ఆప్కో రాజు,బాలరాజు యాదవ్, సునీల్, రాజ్ కుమార్, అశోక్ కుమార్, ఈర్లపల్లి ప్రవీణ్, అనిల్, సింహాచలం, నరేష్ యాదవ్, మల్లేష్,సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మహేందర్, నరేష్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

## జె.ఇ.ఇ. మెయిన్స్ ఫలితాలలో హార్వెస్ట్ అత్యుత్తమ ఫలితాలు



ఖమ్మం, నేటి శుభోదయ ::: 2026–27 విదాసంవత్స రానికిగానూ, దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యనభ్యసించుటకు ఎన్.టి.ఏ వారు నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 2వ దఫా పరీక్షలలో తమ విద్యార్థినీ, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి, జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వ తీ రెడ్డి అన్నారు. ప్రకటించిన ఫలితాలలో సి. హెచ్ కృష్ణమాదుర్ 99.93 పర్సంటైల్తో ఆల్ ఇండియా 1145వ ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడని, వివిధ కాటగిరీలలో పి. అన్విదా రెడ్డి 99.47 పర్సంటైల్ తో 1059వ ర్యాంక్, ఎల్. లోకేష్ 99.42 పర్సంటైల్ 2187వ ర్యాంకు, బి. స్ఫూర్తి 99.31 పర్సంటైల్ 2685వ ర్యాంకు, యం.సాయిచరణ్ 99.29 పర్సంటైల్ 52వ ర్యాంకు, వి.జగత్ 98.71 పర్సంటైల్, 579వ ర్యాంకు, బి.రాంచరణ్ 97.05 పర్సంటైల్ తో, 366వ ర్యాంకు తోపాటు మరెన్నో అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. కళాశాల నుండి 30 శాతం విద్యార్థిని, విద్యార్థులు అడ్వాన్స్డ్ కు అర్హత సాధించడం అభినందనీయమన్నారు. తమ కళాశాల నుండి భౌతికశాస్త్రంలో 99.99 పర్సెంటైల్, గణితంలో 99.91 పర్సెంటైల్ మరియు రసాయనశాస్త్రంలో 99.80 పర్సెంటైల్ సాధించడం జరిగింది. 93.5 అంతకన్నా ఎక్కువ పర్సెంటైల్ 20 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వ తీ రెడ్డి విద్యార్థులను అభినందించి, అడ్వాన్స్ పరీక్షలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని అభిలషించారు. క్రమశిక్షణాయుత ప్రణాళిక, నిరంతరం పర్యవేక్షణ, విద్యార్థుల నిరంతర శ్రమ, ఉత్తమ అధ్యాపక బృందం, తల్లిదండ్రుల ప్రోత్సహం ఈ విజయానికి కారణాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

## చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

### జనసేన పార్టీ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్:రాజు నాయక్



షాద్ నగర్,ఏప్రిల్ 21(నేటి శుభోదయ):ఆరోగ్యరీత్యా త్వరగా కోలుకోవాలని షాద్ నగర్ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆశిశులు ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎల్లవేళల ఉండాలని కోరుకుంటూ అఖిల భారత చిరంజీవి యువత వేవస్థాపక అధ్యక్షులు రవణం స్వామి నాయుడు ఆదేశాల మేరకు అఖిల భారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు షాద్ నగర్ జనసేన పార్టీ సీనియర్ నాయకులు జరుపుల రాజు నాయక్ ఆధ్వర్యంలో స్వామి వారికి100 తమలపాకుల పూజ కార్యక్రమం నిర్వహించారు.ఆలయ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా త్వరగా కోలుకోవాలని ఆయన తెలిపారు అలాగే రాజు నాయక్ మాట్లాడుతూ..జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా త్వరగా కోలుకోవాలని ప్రజా సేవ చేయాలని తెలిపారు.అలాగే మ స్వామి నాయుడు ఆదేశాలు మేరకు మరిన్ని సేవలు చేయాలని తెలిపారు.అలాగే జనసేన మహేందర్ రెడ్డి,శంకర్ గౌడ్ వారి స్ఫూర్తి తో జనసేన పార్టీ ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతం చేయడానికి ముందుంటాం అలాగే పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా త్వరగా కోలుకోవాలని తెలంగాణ రాష్ట్రంలో సీనియర్ నాయకులుతో కలిసి చర్చించి సేవలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్,బాలరాజు,లింగం నాయక్,ప్రభు,బాబు,రవి,రాజేష్ నాయక్,శ్రీశైలం,శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే రివ్యూ



నేటిశుభోదయ: తలకొండపల్లి :రంగారెడ్డి జిల్లా ఆమన్గల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై ఎలక్ట్రిసిటీ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది.ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని పలు రకాల సమస్యలతో రైతులు పలు మార్లు అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నరని,తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ మాజీ ఎంపీటీసీ అంబాజీ మాట్లాడుతు...రైతుల సమస్యలు పరిష్కారించడంలో విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నరని ఆరోపణ వస్తున్నాయి.విద్యుత్ తీగలు పంటపొలాల్లో చేతికి అందేమాదిరిగా తయారైనా ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.చేతికందే వైర్లు, చెట్ల కొమ్మలు,కర్రల సహాయంతో విద్యుత్ తీగలు పలు రకాల సమస్యలతో రైతులు పలు మార్లు అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల రైతులకు కరెంటు సరఫరా నిరంతరంగా అందించాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు శాపంగా మారింది.మనూరు మండల పరిధిలో పలు గ్రామాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది.ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగి పోతుండడంతో కరెంటు సమస్యలు మరింత తీవ్రంగా మారే ఆస్కారం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.పంట పొలాల్లో వంగిన స్థంబాలు సరి చేయాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెల్లినా ఫలితాలు లేకుండా పోయాయని.. పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. దీంతో చిన్న పాటి గాలి వచ్చిన విద్యుత్ తీగలకు మంటల చెలరేగి కరెంటు అంతరాయాలు ఏర్పాడుతున్నాయని రైతుల పేర్కొంటున్నారు.ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు తగ్గడం రైతులకు ఒక సమస్య..ఐతే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కరెంటు అంతరాయం మరోవైపు అన్నట్టుగా తయారైంది.కరెంటు సరఫరా లో వోల్టేజ్ కారణంగా సక్రమంగా లేకపోతే మునుముందు మరింత ఇబ్బందులు తప్పేలా లేనట్టేనని రైతులు వాపోతున్నారు.ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు మండల ఏఈ స్పందించి సమ్యలు పరిష్కరించి కరెంటుకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులపై అంబాజీ తీవ్రంగా మండిపడ్డారు.ఎమ్మెల్యే సైతం రైతులకు విద్యుత్ సమస్య లేకుండా చేయాలని, నిరంతరం ప్రజలకు.రైతులకు,అందుబాటులో ఉండాలని అధికారులకు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సమస్యలు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్న అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు సమకూర్చడంలో నిర్లక్ష్యం వహించొద్దని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ,మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్,మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత,వివిధ మండలాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేటలోఘనంగా

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు కార్యక్రమానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు.



సదాశివపేట ఏప్రిల్ 21 నేటి శుభోదయ ప్రతినిధి :సదాశివపేటలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు హాజరై, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తో కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సేవలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చూపుతున్న నిబద్ధతను ప్రశంసిస్తూ, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటెండెన్స్ ఫీజు కట్టలేదని వేధింపులో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య బాధాకరం

### తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన విభాగం డిమాండ్.

### హాల్ టికెట్ కోసం హింసించిన శ్రీ ఇందు కళాశాల యాజమాన్యం




ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి ఏప్రిల్ 21:ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో శేరిగూడ సమీపంలోని శ్రీ హిందూ కళాశాలలో జరిగిన దారుణం,విద్యార్థి మరణ ఘటనపై పూర్తి విచారణ చేసి కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిమహోదయులకు,ఇబ్రహీంపట్నంలోని శ్రీ హిందూ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మ్యాదరి ప్రణీత్ తండ్రి మ్యాదరి రమేష్, కులం ఎస్సీ మాల,కండోనేషన్ ఫీజు చెల్లించలేదని కారణంగా హాల్ టికెట్ నిరాకరించడం అత్యంత దురదృష్టకరం.ఈ ఘటన కారణంగా అతను తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై, చివరకు ఆత్మహత్యకు పాల్పడిన విషయం మాకు ఎంతో బాధాకరం.ఈ ఘటనలో కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం, విద్యార్థిపై అధిక ఒత్తిడి కారణమైందని మేము గట్టిగా భావిస్తున్నాము. ఒక విద్యార్థి ప్రాణం కోల్పోవడం అనేది చిన్న విషయం కాదు. ఇది విద్యా వ్యవస్థలో జరుగుతున్న అన్యాయాలకు స్పష్టమైన ఉదాహరణ.అందువల్ల ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన కాలేజీ యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మా వినతి. అదేవిధంగా బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలి.తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన విభాగం తరపున, విద్యార్థులపై ఇలాంటి ఒత్తిళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఎలాంటి అన్యాయాలకు గురికాకుండా ప్రభుత్వం,పోలీసులు తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ధన్యవాదాలు.

## జేఈఈ మెయిన్స్-2026 లో అఖండ ఫలితాలు సాధించిన స్టెమ్‌స్పార్క్ కాలేజ్ విద్యార్థులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్- 2026 ఫలితాలలో ఆల్ ఇండియా 393వ ర్యాంక్ సాధించి మొదటి బ్యాచ్‌తోనే సంచలన విజయాలతో ప్రభంజనం సృష్టించటం జరిగిందని డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఐఐటీ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక సీట్ల సాధనే లక్ష్యంగా స్థాపించిన స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ 75 మంది పరిమిత విద్యార్థులతో మొదటి ప్రయత్నంలోనే మొదటి బ్యాచ్‌తో ప్రతిష్ఠాత్మక జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో అఖండ విజయాలను సాధించిందని, బి.అవినాష్. ఆల్ ఇండియా 393వ ర్యాంకు, జి.అంజలి 2055, బి.జ్ఞానశ్రీ 3069, సి.హెచ్. వెంకట సాయి పవన్ 6843, ఆర్.సాయిచరణ్ 11927, బి.ప్రవీణ్ 12198, జి.నాగకార్తికేయ 17246, జి.పావణి 18554తో పాటు 13 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ కి అర్హత సాధించారని తెలిపారు పోటీ పరీక్షలలో విజయమే లక్ష్యంగా కళాశాలను స్థాపించి సామాన్య విద్యార్థులతో కూడా అసామాన్య ఫలితాలను సాధించామని ,ఆల్ ఇండియా 393వ ర్యాంక్ సాధించిన బి.అవినాష్ , అడ్వాన్స్‌కు అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. పరిమిత విద్యార్థులతో అపరిమిత ఐ.ఐ.టి., యన్.ఐ.టి. ర్యాంకులను సాధించి తల్లిదండ్రుల ఆశయాలు, విద్యార్థుల లక్ష్యాలను సాధించడానికి స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ నిరంతర పర్యవేక్షణ, అద్భుత ప్రణాళికలతో ఒత్తిడి లేకుండా ప్రతి స్టూడెంట్‌ను విజయతీరాలకు చేర్చుటకు అకుంఠిత దీక్షతో కృషి చేస్తామని ,విద్యార్థులకు, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ టీమ్‌కు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను గౌరవించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే..

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. ఫరూక్ నగర్ మండలం దేవుని బండ తండాలో మహిళా సమైక్య భవనం ప్రారంభోత్సవం



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి ఏప్రిల్ 21: మహిళలకు సముచిత గౌరవాన్ని ఇచ్చి రాజకీయంగా, సామాజికంగా, ఉపాధి పరంగా ప్రోత్సహించేది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం దేవుని బండ తండా లో స్థానిక సర్పంచ్



శ్రీను నాయక్ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేన్నైనా మాటల్లో చెప్పదని, చేతల్లో చూపిస్తుందని అన్నారు. మహిళలు ఉపాధి పరంగా ఎదిగేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో విస్తృత కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. మహిళా సంఘాలను ప్రోత్సహించే దిశగా మహిళా సమాఖ్య భవనం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 2023 లోని తీర్మానం ప్రవేశపెట్టడం, కాంగ్రెస్ ఆమోదించడం కూడా జరిగిందని, కానీ అబద్ధాలు చెప్పే బిజెపి ప్రభుత్వం డీ లిమిటేషన్ ను అడ్డంగా పెట్టి మహిళా రిజర్వేషన్లను ముందు పెట్టి రాజకీయ కుట్రకు పూనుకుందని అన్నారు. మహిళలపై ఏ మాత్రం గౌరవం లేని పార్టీ బిజెపి అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళలను ప్రధాన మంత్రులను, రాష్ట్రపతులను కూడా చేసిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఈ సందర్భంగా స్థానిక నాయకులు పవన్ చౌహన్, సుమన్, ఈశ్వర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు బాలరాజు గౌడ్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు..

## ఎవిరి చైల్డ్ రీడ్ కార్యక్రమ ప్రశంస అవార్డులు



వైరా నేటి శుభోదయ.: ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్ నందు జిల్లా విద్యాశాఖ అధికారిని చైతన్య జైని అధ్యక్షతన జరిగిన ఎవిరి చైల్డ్ రీడ్ ప్రశంస అవార్డ్స్ కార్యక్రమం నందు వైరా (గుట్ట బడి) ప్రాథమిక పాఠశాలకు హైయెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ చేతుల మీదుగా గుట్టబడి పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆర్ శ్రీనివాసచారి పెనుగొండ ఉపేంద్రరావు తదితరులు అవార్డు అందుకోవడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ మాట్లాడుతూ ఆరు నెలల్లో జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రతి పిల్లవాడు ఇంగ్లీష్ చదివే విధంగా చేపట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యేక ప్రణాళికలతో విద్యార్థులందరూ ఇంగ్లీష్ చదివే విధంగా కృషిచేసి రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చే విధంగా పనిచేసినారని ఆయన తెలియజేసినారు . రాబోయే సంవత్సరం కూడా ఇదే విధమైన పనితీరును కనబరిచి దేశంలోనే ఖమ్మం జిల్లాను ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలని ఆయన కోరినారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైరా మండలానికి చెందిన గుట్టబడి ప్రాథమిక పాఠశాల, ఎంపీపీ ఎస్ గర్ల్స్ ఎంపీ యుపిఎస్ పుణ్య పురం, ఎంపీపీస్ పాలడుగు పాఠశాలలుకు అవార్డులు వచ్చినవి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీజ,సీఈఓ దీక్ష రైనా డీఈవో చైతన్య జైని కొత్తపల్లి వెంకటేశ్వర్లు పెనుగొండ ఉపేంద్రరావు, .శ్రీనివాస చారి, వాసు శైలజ లక్ష్మి సూతకాని స్వప్న, అఫ్జల్ సైదులు తదితర పాఠశాలలఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## దాసాంజనేయ స్వామి ఆలయంలో డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ దంపతుల పూజలు



వైరా నేటి శుభోదయ: వైరా మున్సిపల్ చైర్మన్ ఎన్నికైన తర్వాత మొదటి సారి వైరా ప్రాజెక్టు అలుగులు వద్ద ఉన్నటువంటి దక్షిణ ముఖ దాసాంజనేయ స్వామి ఆలయాన్ని ఈరోజు వైరా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కాపా చంద్రకళ మురళి దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా వారు ఆలయంలో దాసాంజనేయ స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు శ్రీ ఆదిత్య అనంతరామ శర్మ వారిని స్వామి వారి శేషవస్త్రం తో సత్కరించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.. అదే విధంగా తదనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ చావా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కాపా చంద్రకళ దంపతులను సన్మానించారు. అదేవిధంగా బండారుపల్లి రవీంద్రబాబు కూడా శాలువాతో వారిని సన్మానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కాపా చంద్రకళ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అదే విధంగా ప్రస్తుతం ఆలయానికి. శాంక్షన్ అయిన శంకుస్థాపన చేసినటువంటి రోడ్డు నిర్మాణము ,కల్వర్టు త్వరగా పూర్తి చేయుటకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈరోజు ఆలయంలో వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న సంకా ధర్మారావు - రమ్యకృష్ణ కుమారి దంపతుల్ని అదేవిధంగా జన్మదినోత్సవం జరుపుకుంటున్న కొత్తూరు వెంకటరమణమనవరాలు ఉషా అక్షయ లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆదిత్య అనంత రామ శర్మ అదేవిధంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీ చెరుకూరి శ్రీనివాసరావు, శ్రీ జాలాది కోటేశ్వర రావు,శ్రీ కొత్తూరి వెంకటరమణ , శ్రీ గుంటి రవి , శ్రీ మిట్టపల్లి కిరణ్ కుమార్ శ్రీ తాళ్లపల్లి కృష్ణారావు, శ్రీమతి రాయల అన్నపూర్ణ, మేకా నాగేశ్వర రావు,హరి రమేష్, గ్రంధె విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు..

## హిందూ సంస్కృతిని కాపాడటం అందరి బాధ్యత

### కంఠేశ్వర్ హిందూ సమ్మేళనంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ :హిందూ సంస్కృతిని కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా తెలిపారు.నగరంలోని కంఠేశ్వర్ ఆలయంలో మంగళవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూడసమాజంలో కొన్నిసార్లు చిన్న విభేదాలతో కులం,ప్రాంతం,భాష మనల్ని విడదీస్తున్నాయన్నారు.ఇవి హిందూ సమాజానికి బలహీనతలు కావాలి అన్నారు.అలాగే ఆర్ ఎస్ ఎస్ నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాల్లో వక్తలు చెబుతున్న మాటలను శ్రద్ధగా విని పాటించాలన్నారు.కార్యక్రమంలో వక్త కల్వగురి ప్రభుకుమార్,పలుగుట్ట ఆశ్రమ కేదారానంద స్వామీజీ,సేవికా సమితి బౌద్ధిక్ ప్రముఖ్ కల్పన,హిందూ సమ్మేళనం కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి నాగోళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీని విమర్శించే నైతికత మంత్రి తుమ్మలకు లేదు, ఖబడ్దార్ అని హెచ్చరిక

### : ఎం పి వద్దిరాజు రవిచంద్ర




హైదరాబాద్, నేటి శుభోదయ ::: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 19వతేదీన ఖమ్మంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ కార్యక్రమంలో హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రజలకిచ్చిన హామీల అమలు గురించి ప్రశ్నించారు.రైతు రుణమాఫీ నూటికి నూరు శాతం ఎక్కడ అమలయిందో నిరూపించాల్సిందిగా మంత్రి తుమ్మలకు సవాల్ విసిరారు. మొక్కజొన్న పంటను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు,కష్టాల గురించి ఆవేదన వ్యక్తంచేశారు.బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హైదరాబాద్ తెలంగాణ భవన్ లో మంగళవారం ఎమ్మెల్సీ,పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరీష్ రావు ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానం చెప్పలేక ఇష్టారీతిన అవాకులు చెవాకులు మాట్లాడారు.కాళేశ్వరం ప్రాజెక్టు కేసు విషయంలో న్యాయ కోవిదులను కలిసేందుకు సోమవారం నేను, హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఢిల్లీకి వెళ్లడం జరిగింది.మేము వేరే ఎవరినో కలిసేందుకు వెళ్ళినట్లుగా తుమ్మల నిరాధారమైన ఆరోపణలు చేశారు వాస్తవాలను తెలుసుకోకుండా మంత్రి తోచిన విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలిపారు. హరీష్ రావు ఖమ్మం జిల్లాకు రావడమే తప్పు అన్నట్లుగా,వరదలు వచ్చినప్పుడు ప్రజలకు సాయం చేసేందుకు, అండగా నిలబడేందుకు వచ్చినప్పుడు రాళ్లు వేయించారు. హరీష్ రావు ఖమ్మం వస్తే తుమ్మల,ఆయన అనుచరులు భయపడిపోతున్నారు.ఆయన వచ్చినప్పుడల్లా అడ్డుపడుతున్నారు, ఇబ్బందులు పెడుతున్నారు. హరీష్ రావు పోటీ చేసిన ప్రతిసారి భారీ ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అదే తుమ్మల ఎన్నో సార్లు ఓటమి చవిచూశారు. హరీష్ రావును విమర్శించే నైతిక హక్కు నాగేశ్వరరావుకు లేదు.హరీష్ రావు పై ఆయన చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలిపారు. మంత్రిగా ఆయన ఖమ్మం జిల్లాకు ఒరగబెట్టిందేమీ లేదు. పంజాబ్,ఢిల్లీ,కేరళ ముఖ్యమంత్రులను కేసీఆర్ ఖమ్మంకు ఆహ్వానించి సభ పెడితే అందులో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనుల గురించి తుమ్మల మాట్లాడారు. అప్పుడే అది మర్చిపోతే ఎట్ల? అదే సభలో అడిగిందే తడువుగా కేసీఆర్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన 180 కోట్లు మంజూరు చేశారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగాన్ని లక్షలమంది వీక్షించారు.ఆ సభను నీరుకార్చాలనే కుయుక్తితో మంత్రులు నాగేశ్వరరావు, లక్ష్మణ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు నోటికొచ్చినట్టుగా మాట్లాడారు. ప్రధాన ప్రతిక్షంగా ప్రజల పక్షాన బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతుంటే, పాలకులు బురదజల్లు తున్నారు,భూతుల పంచాగం విప్పుతున్నారు. రైతన్నలను రుణాలను 49 వేల కోట్ల రూపాయలు మాఫీ చేస్తామని మొదట చెప్పి,చివరకు కేవలం 23 వేల కోట్లు మాత్రమే చేశారు. రైతుభరోసా సాయం సక్రమంగా లేదు,వడ్లు,ధాన్యం కొనుగోలు పూర్తిగా నిలిచిపోయింది,పంటలకు బోనస్ అందడం లేదు,కరెంట్,యూరియా సరఫరా సక్రమంగా లేదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో కూడా పలుమార్లు విద్యుత్ కోతలు తలెత్తుతున్నాయి.సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ మానస పుత్రిక,దాని ద్వారా గోదావరి నీళ్లను పాలేరులో కలపాలని ప్రణాళిక సిద్ధం చేస్తే,ఇప్పుడది మంత్రి తుమ్మల వల్ల ఆగిపోయింది. కేసీఆర్ ముందు చూపుతో భక్త రామదాసు పథకం ద్వారా తిరుమలాయపాలెంకు నీళ్లు వస్తే,వాటిని తలపై పోసుకుని ఇప్పుడు నా జన్మ ధన్యమైనదని నాగేశ్వరరావు చెప్పడం నిజం కాదా ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు మూతపడే పరిస్థితులు తలెత్తాయి,విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. బీఆర్ఎస్ పాలనలో రూ.8లక్షల కోట్ల అప్పులు చేశారనడం పచ్చి అబద్ధం. కేంద్ర ఆర్థిక నిర్మలా సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా రూ. 2 లక్షల 90వేల కోట్ల అప్పులు మాత్రమే చేశారని ప్రకటించారు.ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఇందుకు రాష్ట్ర ప్రజలకు సమాధానమివ్వాలి. మంత్రి నాగేశ్వరరావు గెల్చిన ఖమ్మం నియోజకవర్గానికి చేసిన మేలు ఏమి లేదు అని విమర్శించారు. పామాయిల్ తోటల గురించి మాట్లాడే మంత్రి తుమ్మల, వాటిని సాగు చేసే రైతుల కష్టాలను పట్టించుకోలే. వారి సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరుతూ నేను రైతులను వెంట తీసుకుని ఢిల్లీలో మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశాను. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటు పడిపోయింది. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన 432 హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు జరుగట్లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు సాధించి పెట్టిన తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు పదవులు అనుభవిస్తున్నారు. వారిని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదు,ఇంకోసారి అవాకులు చవాకులు పేలితే తెలంగాణ ప్రజలు సహించరు కాక సహించరు ఖబడ్దార్ అని హెచ్చరించారు.

## మత్తు పదార్థాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

### జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నిరోధక స్థాయి సమావేశంలో కలెక్టర్,సీపీ




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఏప్రిల్ 21 నేటి శుభోదయ :మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరుగగా,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి,ఇకపై అవలంభించాల్సిన విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలంను కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. క్లోరోఫాం,డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి వాటిని వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తుండడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎవరు కూడా కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు.నిరంతర దాడులు కొనసాగిస్తూనే,మత్తు పదార్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉందని అన్నారు.పాఠశాలలు,కళాశాలల్లో మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు.మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ అనేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ గుర్తు చేశారు.ఎక్కడైనా గంజాయి,క్లోరల్ హైడ్రేట్,డైజోఫామ్,అల్ప్రాజోలం వంటి వాటి రవాణా,విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని,టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు కూడా ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చని సూచించారు.సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు.ఈ సమావేశంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నిజామాబాద్ జోన్ ఏసీపీ సోమనాథం,ఏ.సీ.పీ ప్రకాష్,ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి,జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత,డీఐఈఓ రవికుమార్,ఎం.వీ.ఐ శ్రీనివాస్,కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్,సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు

### - అద్వైత సిద్ధాంత ప్రవర్తకుని స్మరణలో భక్తి శ్రద్ధల వెల్లువ



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరం బోనకల్ రోడ్డులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింగోజు సతీష్ ఆచారి ఆదిశంకరాచార్యుల కాంస్య పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని ఆది శంకరాచార్యునికి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ నేలకొండ వీరాచారి పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు భారత ఆధ్యాత్మిక చరిత్రలో అజరామరమైన స్థానాన్ని సంపాదించారని పేర్కొన్నారు. చిన్న వయసులోనే దేశవ్యాప్తంగా పర్యటించి, హిందూ ధర్మాన్ని పునరుద్ధరించిన మహనీయుడు అని తెలిపారు. ఆయన ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతం బ్రహ్మ సత్యం, జగత్ మిథ్యా అనే భావనతో జీవన సత్యాన్ని సులభంగా వివరించిందని చెప్పారు. భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో అజరామరమైన స్థానం సంపాదించిన జగద్గురు ఆదిశంకరాచార్యులు 8వ శతాబ్దం అద్వైత వేదాంత సిద్ధాంతానికి ప్రప్రథమ ప్రవర్తకులు. సాక్షాత్తు శంకర భగవానుని అవతారంగా భావించబడే ఈ మహనీయుడు భారతీయ తత్వశాస్త్రానికి నూతన దిశానిర్దేశం చేసిన మహా ఋషి. కేరళ రాష్ట్రంలోని కాలడిలో వేదవిశ్వబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆదిశంకరులు, అతి చిన్న వయసులోనే అసాధారణ మేధస్సును ప్రదర్శించారు. కేవలం 32 ఏళ్ల ఆయుష్షులోనే దేశమంతటా పర్యటిస్తూ సనాతన ధర్మాన్ని స్థాపించి, ఆధ్యాత్మిక జ్యోతిని ప్రజల్లో వ్యాప్తి చేసిన మహోన్నతుడు. ప్రస్థానత్రయం అయిన బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులు పై గంభీరమైన భాష్యాలు రచించి, అద్వైత వేదాంతాన్ని సుస్పష్టంగా ప్రజలకు అందించిన అఖండ ప్రజ్ఞాశాలి. భజగోవిందం, సౌందర్యలహరి, వివేకచూడామణి, కనకధారాస్తోత్రం వంటి అద్భుత కృతులను రచించి సాహిత్య రంగానికీ అపూర్వమైన సేవలందించారు. దేశంలోని నాలుగు దిక్కులలో నాలుగు పీఠాలను చతురామ్నాయ పీఠాలు స్థాపించి భారత ఆధ్యాత్మిక ఐక్యతను బలపరిచారు. హిందూ ధర్మంలోని వివిధ ఆరాధనా మార్గాలను ఏకీకరించే ఉద్దేశంతో షణ్మత సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి శివ, విష్ణు, శక్తి, సూర్య, గణపతి, స్కంద ఆరాధనలను సమన్వయం చేశారు.వైశాఖ శుద్ధ పంచమి నాడు అవతరించిన ఆదిశంకరులు, తన 32వ ఏట కేదారనాథ్ లో జ్ఞానబోధ చేసి అనంతలోకాలకు అంతర్ధానమయ్యారు. అద్వైత వేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఆదిశంకరాచార్యులు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేశారని తెలిపారు. ఈ పూజ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల గానం, వేదమంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం భక్తిరసభరితంగా ముగిసింది.

## మంత్రి తుమ్మల కు ఆహ్వానం పలికిన కూరపాటి ప్రదీప్



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల స్వయంభూవై వెలసిన శ్రీ సంభాద్రి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం(గుట్ట) నందు ఈనెల 28 నుండి మే 2 వ తేదీ వరకు జరగనున్న శ్రీ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భం గా మంగళవారం శ్రీ స్వామి వారి బ్రమ్మోత్సవాలు రావలసిందిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని దేవాలయం ఛైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ ఆహ్వానించటం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, కార్యనిర్వహణాధికారి జగన్మోహన రావు, అభివృద్ధి కమిటీ సభ్యులు రవి, సాయి, చల్ల మధు, నాగేంద్ర, సీతారాములు, రాధికా, ఇతర సభ్యులు, అర్చకులు నరహరి రామకృష్ణ చార్యులు , సాయిరాం శర్మ (వేదపండితులు) పాల్గొన్నారు.

## ఫిజిక్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



ఖమ్మం, నేటి శుభోదయ ::: స్థానిక ఎస్ ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల లో ఫిజిక్స్ విభాగం లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న బోయ రాజశేఖర్ కు, వరంగల్ ఎస్.ఆర్ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం నుండి డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా మంగళవారం అభినందనపూర్వక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. ప్రొఫెసర్ ఈ.పురుషోత్తం, పర్యవేక్షణలో అన్ వెయిలింగ్ కెమికల్ ప్రెసర్-ఇండ్యూసుడు మేగ్నటిక్ చేంజెస్ ఇన్ సర్టైన్ హ్యూస్లర్ ఎల్లాయిస్ అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈసందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఏ.ఎల్.ఎన్.శాస్త్రి,డా.సీహెచ్ శ్రీ నివాస్, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.రమాసత్యవతి, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద,ఫిజిక్స్ విభాగాధిపతి డా.అనిత అధ్యాపకులు, డా.బి.శ్రీనివాస్,ఎస్.రాంబాబు,డా.కె.కిరణ్ కుమార్,ధర్మయ్య, అనురాధ వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

# కష్టపడి పనిచేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యం

**: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**– పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి**

**విజయం తర్వాత ఆగకుండా ఇంకా ఉన్నత లక్ష్యాలు సాధించాలి**

**– విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థు లను అభినందిస్తూ, వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, కష్టపడి పని చేస్తే ఎంతటి విజయమైనా సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తన చిన్నతనంలో తనకు ప్రత్యేకమైన కలలు లేదా ఆత్మవిశ్వాసం లేవని, అయితే ఇంటర్ ఫలితాలు తనలో నమ్మకాన్ని పెంచాయని తెలిపారు.



కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించగలమనే విశ్వాసం అప్పుడు కలిగిందని చెప్పారు. ప్రస్తుతం మంచి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థిలో ప్రతిభ, మేధస్సు ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇప్పటితోనే ఆగకుండా ఇంకా ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, మంచి కళాశాలలో సీటు పొందేందుకు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని తెలిపారు. మంచి విద్యా సంస్థల్లో చదవడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు, జీవన శైలీలు తెలుసుకునే అవకాశం ఉంటుందని, ఎప్పుడూ తక్కువగా భావించకూడదని సూచించారు. కష్టపడి పనిచేస్తూ, మనపై మనం నమ్మకం ఉంచితే ఏ లక్ష్యమైనా సాధ్యమని పేర్కొన్నారు. విజయం సాధించిన వారిలో మేధస్సు, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కష్టపడే స్వభావమనే మూడు ముఖ్య లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఒకసారి విజయం సాధించిన తరువాత అక్కడే ఆగిపోకుండా ఇంకా ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి పరిజ్ఞానాన్ని సాధించే దిశగా కృషి చేస్తే విజయం సహజంగా వస్తుందని, వైఫల్యాలు మనల్ని ఆపకూడదని చెప్పారు. జీవితం అనేది సవాళ్లతో నిండినదని, వాటిని ఎలా అధిగమిస్తామన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. కష్టాల ద్వారా వచ్చిన ఫలితాలు మరింత విలువైనవని తెలిపారు. జీవితంలో అవకాశాలు ఎప్పుడూ ఉంటాయని, ఒక అవకాశం కోల్పోయినా మరో అవకాశం వస్తుందని, విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో పట్టుదలగా ఉండాలని సూచించారు. అడ్డంకులు, వైఫల్యాలను పాఠాలుగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల విద్యను నేర్చుకోవడం సులభమైందని, సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్‌ను సానుకూలంగా వినియోగిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, ప్రపంచంలో జరుగుతున్న మార్పులను నిరంతరం తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, ప్రతి నెల ఒక కొత్త పుస్తకం చదివే లక్ష్యాన్ని పెట్టుకోవాలని సూచించారు. చదివిన విషయాలను రాసుకునే అలవాటు పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ విద్యార్థులను తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచాలని ప్రోత్సహించారు. ప్రతి విద్యార్థిని వారి లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని, వాటి సాధనకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. కొంతమంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను చూసి కృషి చేసి మంచి ఫలితాలు సాధించామని చెప్పడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఇకపై విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని, ఆ పరీక్షలలో మూడు గంటల సమయం ఎంతో కీలకమని, ముందుగానే సమగ్రంగా సిద్ధం కావాలని సూచించారు. మనకంటే ఎక్కువ కష్టాలు ఎదుర్కొనే వారు ఎంతో మంది ఉన్నారని గుర్తుంచుకుని ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీల్లో నిర్వహించిన ప్రత్యేక తరగతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంలో ఎంతో సహాయ పడ్డాయని తెలిపారు. ఆ తరగతుల వల్లే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించ గలిగామని పేర్కొన్నారు. అలాగే, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగం, లెక్చరర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రభుత్వ విద్యార్థినీ, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కే.రవిబాబు, కెజిబివి, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఆర్జేసీ, స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్, అంబేద్కర్ కళాశాల, మోడల్ కాలేజీ ఎస్ఓలు, సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## సాంకేతిక వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు పెంపు

**జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు విజయలక్ష్మి**

**పదవ తరగతి తర్వాత సంప్రదాయ కోర్సులకు పరిమితం కాకూడదు**




ఖమ్మం, నేటి శుభోదయ ::: పదవ తరగతి తర్వాత విద్యార్థులు కేవలం సంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా, ఉపాధికి గ్యారెంటీ ఇచ్చే సాంకేతిక వృత్తి విద్యను ఎంచుకోవాలని హన్మకొండ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నందు కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్ టి ), హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయ లక్ష్మి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో చేనేత రంగం ఫ్యాషన్ డిజైనింగ్, టెక్స్టైల్ కెమిస్ట్రీ వంటి అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజీ (డి హెచ్ టిటి ) కోర్సులో ప్రవేశానికి ఉన్న అవకాశాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. మగ్గం నేయడమే కాకుండా సిఎడి (కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్), స్మార్ట్ గార్మెంట్స్ తయారీలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కోర్సు చదువుతున్న కాలంలో విద్యార్థులకు నెలకు రూ. 2,500/- స్టైఫండ్, చేనేత కుటుంబాల వారికి అదనంగా రూ. 5,000/- వరకు లభించే అవకాశం ఉందన్నారు. ఏడాదికి కేవలం రూ. 4,250/- ఫీజుతో ఈ కోర్సు పూర్తి చేయవచ్చని, అనంతరం పెద్ద టెక్స్టైల్ కంపెనీలలో ఉద్యోగాలు లేదా స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత అర్హతగా ఉండగా, మొత్తం 60 సీట్లు మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయబడతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ మొదటి వారం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణం, నాంపల్లి, హైదరాబాద్‌లో సమర్పించవచ్చన్నారు. ఖమ్మం జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ సిబ్బంది, విద్యార్థులు , తల్లిదండ్రులు , తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**– 'నేతన్న భరోసా' పథకం ద్వారా ఆర్థిక భద్రత**

**– కలెక్టరేట్‌లో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



ఖమ్మం, నేటి శుభోదయ ::: చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం 151 మంది అర్హులైన చేనేత కార్మికులకు మొత్తం రూ. 4,56,000 విలువైన 'నేతన్న భరోసా' చెక్కులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేనేత కార్మికులకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. 'నేతన్న భరోసా' పథకం ద్వారా కార్మికులకు భరోసా కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని చెప్పారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నేతన్నలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. హన్మకొండ చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా ఈ చెక్కుల పంపిణీ నిర్వహించినట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. 151 మంది చేనేత కార్మికులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారులు, జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానం తో సమానం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి -150 వ సారి రక్తదానం చేసిన అంజిరెడ్డి**

**-రక్తదానం చేసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్**



నేటిశుభోదయ: తలకొండపల్లి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమన్గల్ మెంబర్, రెగ్యులర్ రక్తదాత 149 సార్లు రక్తదానం చేసిన అంజిరెడ్డి ఈరోజు 150వ సారి రక్తదానం చేయడానికి సంకల్పించి, ఇచ్చిన పిలుపుమేరకు 150 మంది ఆరోగ్యవంతులైన నవ యువకులు ఈ మండుటెండల్లో రక్తదానం చేయడం చాలా సంతోషకరమైన విషయం అని, ప్రతి ఒక్క వ్యక్తి రక్తదానం చేయాలని,రక్తదానమే ప్రాణదానమని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు.

అంతకుముందు ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్తం ఏ ఫ్యాక్టరీలోనూ ఇప్పటివరకు తయారు చేయలేదని కేవలం మనిషి మాత్రమే ఇంకో అవసరం ఉన్న మనిషికి ఇవ్వాల్సిందేనని కాబట్టి ఇలాంటి రక్తదాన శిబిరాలు విరివిగా నిర్వహించాలని 45 కిలోలు బరువున్న,18 ఏళ్లు దాటిన యువకులు.

ఎవరైనా రక్తాన్ని దానం చేయవచ్చని, రక్తదానం పట్ల అపోహలు తొలగించుకోవాలని,సూచించారు ఈరోజు 150 వ సారి రక్తదానం చేస్తున్న తమ మెంబర్ అంజిరెడ్డిని ఘనంగా సన్మానించి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పిన్ ని బహూకరించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యట గీత నరసింహ టిపిసిసి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డి డిసిసి లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శి రవీందర్ యాదవ్ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ మైనారిటీ మండల అధ్యక్షులు ఆరిఫ్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెన్నకేశవులు జిల్లా మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి, డాక్టర్ దామోదర్ రెడ్డి రీజియన్ చైర్ పర్సన్ జనార్దన్ రెడ్డి, జోన్ చైర్ పర్సన్ జూలూరు లింగయ్య క్లబ్ అధ్యక్షుడు కే గోవర్ధన్ రెడ్డి, సెక్రటరీ గంప శ్రీనివాస్, కోశాధికారి గంగుల శ్రీనివాస్ రెడ్డి కంటే ఓంకారం లక్ష్మీనారాయణ, కే రామ్ రెడ్డి,గుజ్జరి నరసింహ,టీచర్ జంగయ్య, జూలూరు రమేష్, ఎం చంద్రశేఖర్ , వెంకటేష్, రాజు బిచ్య నాయక్ , కుమార్ గౌడ్ తదితరులతోపాటు క్లబ్ పిఆర్ఓ ఎండి పాషా, తదితరులు పాల్గొన్నారు

# భూ రికార్డుల్లో 'సువర్ణాధ్యాయం'

**– కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్, రాష్ట్రంలో కొత్త శకం**

**– భూధార్‌తో రైతు హక్కుకు శాశ్వత భరోసా, పాలేరు గడ్డపై సంస్కరణల జెండా**

**– ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 'భూభారతి' అమలుకు మంత్రి పొంగులేటి అంకురార్పణ**

ఖమ్మం, కూసుమంచి, నేటి శుభోదయ ::: తెలంగాణ రెవెన్యూ చరిత్రలో మంగళవారం ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న భూ తగాదాలకు చరమగీతం పాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్వే మ్యాప్ ఆధారిత రిజిస్ట్రేషన్' ప్రక్రియ పట్టాలెక్కింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కుసుమంచి మండలం నుంచి ఈ విప్లవాత్మక మార్పుకు అంకురార్పణ చేశారు. రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని, ఆ హక్కుకు సర్వే మ్యాప్ మరియు భూధార్‌తో రక్షణ కల్పించినప్పుడే రైతు కుటుంబానికి భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

**- మ్యాప్ ఉంటేనే రిజిస్ట్రేషన్, వివాదాలకు శాశ్వత చెక్**

గతంలో రిజిస్ట్రేషన్ అంటే కేవలం కాగితాల మీద రాసుకునే దస్తావేజులు మాత్రమే ఉండేవి. దీనివల్ల సరిహద్దు వివాదాలు తలెత్తి రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ 'భూభారతి' చట్టం ద్వారా రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమికి సంబంధించిన స్పష్టమైన సర్వే మ్యాప్ (ఎల్ పి ఎం) ఉండటాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా కూసుమంచి మండలం గట్టు సింగారం గ్రామంలోని సర్వే నంబర్ 156/ఇ/1 లో గల ఒక ఎకరా నాలుగు గుంటల భూమికి సంబంధించి రాష్ట్రంలోనే తొలి 'మ్యాప్ ఆధారిత' రిజిస్ట్రేషన్ జరిగింది. నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామానికి చెందిన రైతు భాగం కిషన్ రావు తన భూమిని, అదే గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావుకు విక్రయించగా తహసీల్దార్ కార్యాలయంలో భూమి హద్దులతో కూడిన మ్యాప్‌ను జతచేసి ప్రక్రియను పూర్తి చేశారు. దీనివల్ల భవిష్యత్తులో పొరుగు రైతులతో వచ్చే సరిహద్దు తగాదాలకు ఇకపై తావుండదు.

**- భూమికి విశిష్ట గుర్తింపు, 'భూధార్'తో పక్కా భద్రత**

మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టే, ఇకపై ప్రతి భూకమతానికి ఒక విశిష్టమైన 'భూధార్' నెంబర్‌ను ప్రభుత్వం కేటాయిస్తోంది. కూసుమంచిలో జరిగిన ఈ చారిత్రక రిజిస్ట్రేషన్‌కు '795 జిసిహెచ్ డిసియుపిజే 7 హెచ్ ఓ ' అనే భూధార్ సంఖ్యను (భూ కమత పటము-1) కేటాయించారు. దీనివల్ల భూమి యజమాని వివరాలు, విస్తీర్ణంపై ఎలాంటి సందేహాలకు తావుండదు. యాజమాన్య హక్కులను శాశ్వతంగా నిర్ధారించడమే కాకుండా, ఎవరైనా స్వచ్ఛందంగా తమ ఆస్తుల సర్వే సర్టిఫికేట్ పొందాలనుకుంటే కూడా దరఖాస్తు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. ఈ విధానం ద్వారా భూ వ్యవహారాల్లో పూర్తిస్థాయి పారదర్శకత వస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్, దేశానికే దిక్సూచి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంతో పాటు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో ఈ కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. పాతకాలపు గొలుసు సర్వేలకు స్వస్తి పలికి, అత్యాధునిక 'రోవర్ల' సహాయంతో కచ్చితమైన కొలతలు తీస్తున్నారు. ఈ వినూత్న విధానం త్వరలోనే దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలవనుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# ఒక ఓటుకు రూ. 25,000 ఇచ్చారా.. రాత్రికి రాత్రే లక్షాధికారులైన ఓటర్లు

**– కలకలం రేపుతున్న ధనిక అభ్యర్థి తీరు**

హైదరాబాద్, అమరావతి, నేటి శుభోదయ ::: తమిళనాడు మధ్య భాగంలోని ఒక నియోజకవర్గానికి చెందిన ఒక ధనిక అభ్యర్థి, ఒక్కో ఓటుకు ఏకంగా రూ. 25 వేల చొప్పున పంపిణీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసి సదరు నియోజకవర్గంలో ఆయనపై పోటీ చేస్తున్న ఇతర అభ్యర్థులు షాక్‌కు గురయ్యారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న జరగనున్నాయి. వీటికి సంబంధించిన ప్రచారం రేపు సాయంత్రంతో ముగియనుంది. సమయం తక్కువగా ఉండటంతో రాజకీయ పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, బహుమతులను స్వాధీనం చేసుకుంటున్నారు. అయితే, ఎన్నికల అధికారుల కళ్లు గప్పి అభ్యర్థులు భారీగా నగదు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బును నీళ్లలా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. అక్కడక్కడా ఒక ఓటుకు రూ. 1000, రూ. 1500, రూ. 5000 వరకు ఇస్తుండగా.. ఒక ధనిక అభ్యర్థి మాత్రం ఏకంగా రూ. 25 వేలు పంపిణీ చేస్తున్నారట.

**- రూ. 500 కోట్ల పంపిణీ..**

సదరు నియోజకవర్గంలో సుమారు 2 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు అంచనా. ఆ లెక్కన చూస్తే, కేవలం ఓట్ల కోసమే ఆయన దాదాపు 500 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉండవచ్చని తెలుస్తోంది. ఒక ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే, ఆ కుటుంబానికి ఏకంగా రూ. 1 లక్ష వరకు అందుతోంది. దీనికి పోటీగా ప్రత్యర్థి అభ్యర్థి రూ. 6000 చొప్పున పంచుతున్నారట. అయితే ధనిక అభ్యర్థి ఇస్తున్న భారీ మొత్తంతో పోలిస్తే తన గెలుపు సాధ్యమేనా, తాను పంచిన రూ. 6000 వృథా అవుతుందా అని ఆయన ఆందోళన చెందుతున్నారట. స్వతంత్ర అభ్యర్థుల ఆవేదన: చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారి కుటుంబ సభ్యులకు కూడా ఆ ధనిక అభ్యర్థి నుండి రూ. 25 వేలు అందడంతో.. "కనీసం మన కుటుంబం మనకు ఓటు వేస్తుందా..?" అనే అనుమానం వారిలో మొదలైంది. దీంతో పార్టీలకతీతంగా అభ్యర్థులందరూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఆ ధనిక అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించాలని యోచిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఓటుకు డబ్బు ఇవ్వడం ఎంత నేరమో.. ఆ డబ్బును తీసుకోవడం అంతకంటే పెద్ద నేరం. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును నగదుకు అమ్ముకోకుండా, మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

# 26 న 'కీర్తన' దీర్ఘ గాన ప్రదర్శన

**– 12 గంటలపాటు 111 పాటలతో స్వర విన్యాసం**

**– ప్రపంచ రికార్డ్ సాధనే లక్ష్యంగా**

ఖమ్మం కల్చరల్, నేటి శుభోదయ ::: ప్రపంచ రికార్డుల వేదికగా మారిన ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం మరో రికార్డును తన గళసీమన ధరించడానికి సిద్ధమైంది. అందుకు ఈనెల 26 వ తేదీన మూహూర్తం ఖరారైంది. స్వరమధురిమ కల్చరల్స్ సమర్పణలో బిజీ గాయని ఎస్కే కీర్తన ప్రధాన గాయకురాలిగా 12 గంటలపాటు 111 సినీ గీతాలతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆమధ్య ఒక సినీ హీరో జన్మదినం సందర్భంగా అభిమానులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పాటల పోటీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉత్తమ గాయనిగా కీర్తన ఎంపికయ్యారు. పిమ్మట రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనడంతో ఆమెలోని టాలెంట్ వెల్లడైంది.

**- బిజీ సింగర్-వాయిస్ పవర్**



తెలంగాణలోని పలు ప్రాంతాలలో తన గళ విన్యాసంతో సంగీత ప్రియులను అమితంగా ఆకట్టుకున్నారు కీర్తన. ఆమె వాయిస్ లోని పవర్ ప్రేక్షకులను ఇట్టే కట్టి వడేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి రోజూ ఏదో ఒక చోట ఏదో ఒక సాంస్కృతిక సంస్థ ద్వారా తన ప్రదర్శన వుండడం గమనార్హం. ఖమ్మంలోని దాదాపు అన్ని కళా సంస్థల కార్యక్రమాల్లో ఆమె గాన ప్రదర్శనలిచ్చారు.

పాత సినిమా పాటలలోని కఠినమైన శాస్త్రీయ గీతాలను సైతం అవలీలగా పాడగల పవర్ ఆమె స్వరంలో వుంది. ఇక ఇప్పుడొచ్చే అల్లరల్లర పాటలను కష్ట పడకుండానే సులభంగా పాడేస్తుంది. ఆమె స్వరం క్లియర్ గా వుంటుంది అందులోంచి గమకాలు స్పష్టంగా పలుకుతాయి. ఎక్కడా అస్పష్టత,అపశబ్ధం వినిపించవు.

పాత పాటల్లోని లాలిత్యం,సాహిత్యం చక్కగా పలుకుతూ కొత్త పాటల్లోని చమక్కులు,గిమ్మిక్కులు వినిపించగల గాత్రం కీర్తనది. వేదికపై మట్టుగా మర్యాదగా మసలడం ఆమెకో అదనపు అలంకారం. నీ లీల పాడెద దేవా ... గీతం పాటల ప్రయాణంలో ఆమె పాడిన వాటిలో బాగా ఆదరణ పొంది ఎంతో మందిని తన అభిమానులుగా మార్చుకున్నారు. కీర్తన ఈ నెల 26 న చేపట్టబోయే స్వరవల్లరి ప్రపంచ రికార్డుల సాధనే లక్ష్యంగా సాగనున్నది. కార్యక్రమం విజయవంతం చేయాలని ,తనను ఆశీర్వదించాలని కోరుతూ ఆమె పలువురు కళాకారులు,ప్రముఖులను వ్యక్తగతంగా కలిసి అభ్యర్థించారు. కీర్తన పాటలు వినడం కోసం హాజరయ్యే ప్రేక్షకులు కూడా అధికంగా హాజరయ్యే అవకాశం వుందని, ఇది స్వరమధురిమకు లాభించనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సమంత కెరీర్ గ్రాఫ్..గ్యాప్!





ఏ మాయ చేసావే అంటూ అడుగుపెట్టిన సమంత అనతి కాలంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ ఆరంభంలో అమ్మడి ప్రయాణం ఒక ప్రభంజనంలా సాగింది. మహేష్ , పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస విజయాలు సాధిస్తూ సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికలలో ఒకరిగా సత్తా చాటారు. ఆ సమయంలో ఆమె కెరీర్ గ్రాఫ్ నిరంతరం ఎదుగుతూనే ఉంది. అయితే వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు సమంత వృత్తిపరమైన వేగాన్ని ప్రభావితం చేసాయి అన్నది కాదనలేని నిజం. వివాహం తర్వాత కూడా ఆమె-రంగస్థలం-, మజిలీ, ఓ బేబీ వంటి చిత్రాలతో నటనలోని వైవిధ్యాన్ని నిరూపించు కున్నారు. కానీ వైవాహిక జీవితంలో విడిపోవడం , ఆ తర్వాతి కాలంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు ఆమెను సినిమాలకు కొంతకాలం దూరం చేశాయి. మయోసైటిస్ వ్యాధి వల్ల శారీరకంగా, మానసిక సిద్ధంగా బలపడటానికి ఆమె కావాలనే సినిమాలకు సుదీర్ఘ విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత సమంత కేవలం వెండితెరకే పరిమితం కాకుండా డిజిటల్ మాధ్యమంపై దృష్టి సారించారు. ది ఫ్యామిలీ మ్యాన్ 2 సిరీస్‌తో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న అమ్మడు అటుపై తన కెరీర్ పంథాను మార్చుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథా బలమున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రాలను ఎంచుకోవడం మొదలుపెట్టారు. యశోద, శాకుంతలం వంటి ప్రయత్నాలు ఆ కోవలోకి చెందినవే అయినా అవి ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయాయి. గత మూడేళ్ల కాలంలో సమంత కెరీర్ గ్రాఫ్‌లో స్పష్టమైన గ్యాప్ కనిపిస్తోంది. ఆమె తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ ప్రారంభించి 'మా ఇంటి బంగారం' వంటి సినిమా ఇంకా షూటింగ్ దశలోనే ఉంది. ప్రస్తుతం సమంత ఎంపిక చేసిన ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. సమంత తన వ్యక్తిగత జీవితానికి , వృత్తికి మధ్య సమతుల్యత సాధించే క్రమంలోనే ఈ స్థాయిలో గ్యాప్ తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమె వ్యక్తిగత జీవితం మళ్లీ స్థిరపడినట్లు కనిపిస్తున్నా? సినీ కెరీర్ విషయంలో మాత్రం ఆమె ఇంకా పాత వైభవం కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఒకప్పుడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే స్థాయి నుండి ఇప్పుడు ఒక్క సినిమా విడుదల కోసం అభిమానులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సమంత సెకండ్ ఇన్నింగ్స్‌లో క్వాంటిటీ కంటే క్వాలిటీ కే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె నిర్ణయాలు చెబుతున్నాయి. సామా ఆరంభంలో కమర్షియల్ స్టార్‌గా వెలిగిపోయారు. కానీ నేడు ఒక పరిణతి చెందిన నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక మార్గాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ గ్యాప్ తర్వాత ఆమె చేసే సినిమాలు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా ? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. కెరీర్ సెకండ్ హాఫ్‌లో ఆమె తీసుకోబోయే నిర్ణయాలే భవిష్యత్తులో ఆమె స్థానాన్ని డిసైడ్ చేస్తాయన్నది కాదనలేని నిజం.

# నెట్‌ఫ్లిక్స్‌తో నిఖిల్ 'స్వయంభు' డీల్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్!







టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కార్తికేయ 2 తో పాన్ ఇండియా హీరోగా మారిపోయారు. ఇప్పుడు 'స్వయంభు' అనే భారీ పీరియాడిక్ డ్రామాతో మన ముందుకు వస్తున్నాడు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ విషయంలో నెట్‌ఫ్లిక్స్ ఒక మైండ్ బ్లోయింగ్ ఆఫర్ ఇచ్చింది. థియేటర్ కలెక్షన్లను బట్టి ఓటీటీ రేటును నిర్ణయించే ఈ సరికొత్త ఒప్పందం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ డీల్ వల్ల నిర్మాతలకు లాభమా లేక నష్టమా? అసలు ఈ కొత్త ట్రెండ్ వెనుక ఉన్న మర్మమేంటో ఇప్పుడు చూద్దాం.

**బాక్సాఫీస్ వసూళ్లే ఓటీటీ ధర:** నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న 'స్వయంభు' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సాధారణంగా ఒక సినిమా రిలీజ్‌కు ముందే ఓటీటీ హక్కులు భారీ ధరలకు అమ్ముడవుతుంటాయి. కానీ, ఈ సినిమా కోసం నెట్‌ఫ్లిక్స్ ఒక వినూత్నమైన ఆఫర్‌ను నిర్మాతలకు ఇచ్చిందట. ఇక ఈ చిత్రం థియేటర్లలో ఎంత 'నెట్ కలెక్షన్' సాధిస్తుందో, అందులో సరిగ్గా 50 శాతం మొత్తాన్ని డిజిటల్ రైట్స్ కింద చెల్లిస్తారట. అంటే బాక్సాఫీస్ వద్ద సినిమా ఎంత పెద్ద హిట్ అయితే, ఓటీటీ సంస్థ నుండి అంత ఎక్కువ సొమ్ము నిర్మాతలకు అందుతుందన్నమాట

**ఓటీటీల రూటు మార్చిన నష్టాలు:** గతంలో హీరో క్రేజ్‌ను బట్టి కళ్లు మూసుకుని కోట్ల రూపాయలు కుమ్మరించిన ఓటీటీ సంస్థలు, ఇప్పుడు రూటు మార్చాయి. భారీ రేట్లకు కొన్న సినిమాలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఆశించిన స్థాయిలో వ్యూస్‌ను రాబట్టలేకపోవడంతో ఓటీటీ దిగ్గజాలు నష్టాల్లో కూరుకుపోయాయి. అందుకే ఇప్పుడు 'పర్ఫార్మెన్స్ క్లాజ్' అనే పద్ధతిని తీసుకొచ్చాయి. ఇక థియేటర్లలో ఏ సినిమాకైతే జనం బ్రహ్మరథం పడతారో, అదే సినిమాకు ఓటీటీలోనూ మంచి ఆదరణ ఉంటుందని నెట్‌ఫ్లిక్స్ గట్టిగా నమ్ముతోంది. అందుకే ఈ 'సగం కలెక్షన్ల' ఆఫర్ తెరపైకి వచ్చింది. చాశ్రీంశీ =ముs - నిజమే అయితే అది ప్రభంజనమే!

**టాలీవుడ్‌లో కొత్త మార్పుకు శ్రీకారం:** ఈ సరికొత్త ఒప్పందం టాలీవుడ్‌లో ఒక కొత్త ట్రెండ్‌కు దారితీసేలా కనిపిస్తోంది. ఇది నిర్మాతలకు ఒక రకమైన రిస్క్ అయినప్పటికీ, సినిమా కంటెంట్‌పై గట్టి నమ్మకం ఉంటే మాత్రం జాక్‌పాట్ కొట్టినట్లే. ఒకవేళ బాక్సాఫీస్ వద్ద సినిమా 100 కోట్లు వసూలు చేస్తే, ఓటీటీ నుండి అదనంగా మరో 50 కోట్లు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక ఈ మోడల్ సక్సెస్ అయితే భవిష్యత్తులో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి సినిమాకు 'థియేట్రికల్ హిట్' అనేది ఓటీటీ బిజినెస్‌ను శాసించే ప్రధాన అంశంగా మారుతుంది.

**'స్వయంభు' పై పెరుగుతున్న అంచనాలు:** సంయుక్త మీనన్, నభా నటేష్ వంటి ముద్దుగుమ్మలు నటిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే చిత్ర యూనిట్ రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. కంటెంట్ బాగుంటే ఆడియన్స్ ఎలాగూ ఆదరిస్తారు, తద్వారా ఓటీటీ రేటు కూడా పెరుగుతుందనే ధీమాతో చిత్ర యూనిట్ ఉన్నట్లు తెలుస్తోంది. మరి నిఖిల్ తన 'స్వయంభు'తో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో, నెట్‌ఫ్లిక్స్‌ను ఎంత మేరకు లాభాల్లోకి నెడతాడో వేచి చూడాలి. ఇక మొత్తానికి ఈ డీల్ మాత్రం ఇండస్ట్రీలో ఒక పెద్ద సెన్సేషన్!



# రాకా: బన్నీ ప్లానే వేరు.. అప్పుడే ట్రెండ్ సెట్టర్ గా..





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరోసారి తన లుక్ తోనే సంచలనం సృష్టిస్తున్నారు. పుష్ప 2 వంటి భారీ విజయానంతరం ఆయన నుంచి వస్తున్న కొత్త ప్రాజెక్ట్ రాకా ఇప్పటికే హాట్ టాపిక్ గా మారింది. టైటిల్ పోస్టర్ విడుదలతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. రాకా ఫస్ట్ లుక్ ను సాధారణంగా విడుదల చేయకుండా, ప్రత్యేకంగా ప్లాన్ చేయడం విశేషం. పోస్టర్ లో డార్క్ అండ్ ఇంటెన్స్ కలర్ టోన్‌తో మేకర్స్ కొత్త ప్రపంచాన్ని చూపించే ప్రయత్నం చేశారు. హీరో లుక్ ను పూర్తిగా రివీల్ చేయకపోయినా, బ్యాక్ డ్రాప్ లో కనిపించే ఎలిమెంట్స్.. సినిమా భారీ యాక్షన్ డ్రామాగా ఉండబోతుందని క్లారిటీ ఇస్తున్నాయి. రాకా అనే టైటిల్ కూడా మాస్ ఫీల్ ను కలిగిస్తూ, సినిమాలో ఉన్న రగ్డ్ ఎమోషన్ ను హైలైట్ చేస్తోంది. ఇక ప్రాజెక్ట్ లో అత్యంత చర్చనీయాంశంగా మారింది అల్లు అర్జున్ లుక్. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. సినిమాలో ఆయన సగం మనిషి సగం తోడేలు తరహా గెటప్ లో కనిపించబోతున్నారని టాక్ వినిపిస్తోంది. ఇది కేవలం మేకోవర్ మాత్రమే కాకుండా, కథలో కీలకమైన అంశంగా ఉండబోతుందని టాక్. ఆ కాన్సెప్ట్ ద్వారా దర్శకుడు అట్లీ కుమార్ మరోసారి కొత్త ప్రయోగానికి సిద్ధమయ్యారని తెలుస్తోంది. ఆ లుక్ కోసం అల్లు అర్జున్ పడుతున్న కష్టం కూడా ప్రత్యేకంగా నిలుస్తోంది. రోజూ 3 నుంచి 4 గంటల పాటు మేకప్, స్టైలింగ్, డిటైలింగ్ కోసం సమయం కేటాయిస్తున్నారని సమాచారం. ఒక భారీ హిట్ తర్వాత సాధారణంగా నటులు కంఫర్ట్ జోన్ లోకి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, అల్లు అర్జున్ మాత్రం తనను తాను కొత్తగా మలుచుకునే ప్రయత్నం చేస్తుండటం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇదే కారణంగా రాకాపై ఎక్స్పెక్టేషన్స్ మరింత పెరుగుతున్నాయి. ప్రతి సినిమాతో కొత్తగా కనిపించాలనే ఆయన ప్రయత్నం క్లియర్ గా కనిపిస్తోంది. ఇప్పటికే బన్నీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యంగా టీమిండియా క్రికెటర్ హార్దిక్ పాండ్య.. సినిమాలోని సిగ్నేచర్ హ్యాండ్ జెశ్చర్ ను రీక్రియేట్ చేయడం మరింత హైలైట్ గా మారింది. దీంతో ఫ్యాన్స్‌లో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇక నిర్మాణ పరంగా కూడా రాకా భారీ ప్రాజెక్ట్ గా రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్.. దాదాపు రూ.800 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిస్తున్న ఆ సినిమా, భారతీయ సినీ చరిత్రలో అత్యంత కాస్ట్లీ చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది.. మొత్తానికి, టైటిల్ పోస్టర్ తోనే భారీ బజ్ సృష్టించిన రాకా, విడుదలకు ముందే ట్రెండ్ సెట్టర్ గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. బన్నీ కొత్త లుక్, అట్లీ డైరెక్షన్, భారీ బడ్జెట్ అన్నీ కలిసి సినిమాను మోస్ట్ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ గా మార్చుతున్నాయి.



# స్టన్నింగ్ లుక్‌లో మెరిసిన నోరా ఫతేహి





బాలీవుడ్ డ్యాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. తన అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్‌తోనే కాకుండా, బోల్డ్ అండ్ గ్లామరస్ ఫ్యాషన్ సెన్స్‌తో కూడా నోరా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటుంది. ఈసారి బ్లాక్ కలర్ షార్ట్ డ్రెస్సులో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. అందానికే అందం అనేంతగా ఆమె ఈ ఫొటోల్లో మెరిసిపోతోంది. నోరా ఫతేహి తాజాగా పోస్ట్ చేసిన ఫోటోలు చూస్తుంటే, ఆమె అందం మునుపటి కంటే రెట్టింపు అయినట్లు అనిపిస్తోంది. బ్లాక్ కలర్ డారెన్ షార్ట్ డ్రెస్సులో ఆమె అత్యంత ఆకర్షణీయంగా కనిపించింది. ఆ డ్రెస్సుపై ఉన్న స్టైలిష్ జాకెట్, దానికి తగ్గట్టుగా వేసుకున్న చైన్ నెక్లెస్ ఆమె లుక్‌ను మరింత ఎలివేట్ చేశాయి. కుర్చీపై కూర్చుని ఆమె ఇచ్చిన బోల్డ్ అండ్ గ్లామరస్ పోజులు కుర్రకారును కట్టిపడేస్తున్నాయి. ఈ ఫోటోషూట్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్‌గా మారింది. నోరా ఫతేహి అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది ఆమె అదిరే డ్యాన్స్ మూవ్స్. కానీ, కేవలం డ్యాన్స్ మాత్రమే కాదు, ఫ్యాషన్ ప్రపంచంలోనూ ఆమె తనదైన ముద్ర వేసింది. తరచుగా ట్రెండీ అవుట్‌ఫిట్స్, టైట్ ఫిట్టింగ్ దుస్తులలో, ముఖ్యంగా బోల్డ్ బ్లాక్ డ్రెస్సులలో ఫోటోలను పంచుకుంటూ వైరల్ అవుతుంటారు. ఇక ఆమె ఫ్యాషన్ సెన్స్ ఎప్పుడూ కొత్తగా, స్టైలిష్‌గా ఉంటుంది. అందుకే ఫ్యాషన్ ప్రియులు కూడా ఆమెను ఫాలో అవుతుంటారు. నోరా ఫతేహి తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా పరిచయం. 'బాహుబలి' చిత్రంలోని 'మనోహరి' పాటతో ఆమె తెలుగులో భారీ పాపులారిటీ సంపాదించుకున్నారు. ఆ పాటలో ఆమె చూపిన అందచందాలు, డ్యాన్స్ మూవ్స్ ఇప్పటికీ ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయాయి. అలాగే 'టెంపర్' వంటి చిత్రాలలో కూడా ఐటెం సాంగ్స్‌తో అలరించారు. ఇక తెలుగులో ఆమెకు ఉన్న క్రేజ్ కారణంగా, ఆమె పెట్టే ప్రతి పోస్ట్ కూడా ఇక్కడా వైరల్ అవుతూ ఉంటుంది. నోరా పర్ఫెక్ట్ ఫిగర్ మరియు మెరిసే చర్మం ఎప్పుడూ చర్చనీయాంశమవుతుంటాయి. దీని వెనుక ఆమె చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. సమాచారం ప్రకారం, నోరా తన చర్మ సంరక్షణలో మొరాకన్ ఉత్పత్తులను, ముఖ్యంగా '×ఓఆశ్రీ' బ్రాండ్ ను ఇష్టపడతారు. అలాగే, స్కిన్ టైటనింగ్ కోసం లేజర్ పరికరాలను కూడా ఉపయోగిస్తారని అంటుంటారు. ఇక ఆమె ఫిట్‌నెస్ ఫ్రీక్ అని, రోజూ కఠినమైన వ్యాయామాలు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమశిక్షణే ఆమెను ఇంత గ్లామరస్‌గా ఉంచుతోంది. మొత్తానికి, నోరా ఫతేహి తాజా ఫోటోషూట్‌తో మరోసారి తన గ్లామర్ పవర్ చూపించారు. డ్యాన్స్, ఫ్యాషన్ రెండింటిలోనూ అదరగొడుతూ, ఆమె కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. ఆమె రాబోయే ప్రాజెక్టుల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ఒకే సినిమాతో యూనివర్స్ బిల్డ్.. మిరాయ్2 పై భారీ ప్లాన్!



టాలీవుడ్‌లో రీసెంట్ గా వచ్చిన పాన్ ఇండియా హిట్స్‌లో మిరాయ్ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన ఈ సినిమా, ఇప్పుడు అవార్డ్స్ సర్క్యూట్‌లో కూడా అదే జోరు కొనసాగిస్తూ వార్తల్లో నిలుస్తోంది. ముఖ్యంగా గద్దర్ తెలంగాణ అవార్డ్స్, ×చీజూ అవార్డ్స్2026లో సాధించిన విజయాలు, ఈ సినిమాకు ఉన్న టెక్నికల్ స్ట్రెంగ్త్‌ను మరోసారి రుజువు చేశాయి. గ్రాండ్ విజువల్స్, హై ఎండ్ ఎఫీశ, కచ్చితమైన ఎగ్జిక్యూషన్ ఇవన్నీ కలిపి ఈ సినిమాను కేవలం కమర్షియల్ హిట్‌గా కాకుండా క్రిటికల్‌గా కూడా నిలబెట్టాయి. ఈ సక్సెస్ కు మెయిన్ రీజన్ డైరెక్టర్ కార్తిక్ ఘట్టమనేని విజన్. విజువల్ నెరేషన్‌లో కొత్తదనం తీసుకురావడం, కథను గ్రాండ్ స్కేల్‌లో ప్రెజెంట్ చేయడం ద్వారా ఆయన టెక్నికల్ బ్రిలియన్స్‌ను చూపించారు. సినిమాటోగ్రఫీ నుండి వీఎఫ్ఎక్స్ వరకు ప్రతి అంశంలో ఉన్న క్వాలిటీ, మిరాయ్‌ను టెక్నికల్‌గా స్టాండౌట్ ఫిల్మ్‌గా మార్చింది. అదే సమయంలో, రూటెడ్ స్టోరీ టెల్లింగ్‌తో కమర్షియల్ ఎలిమెంట్స్‌ను బ్యాలెన్స్ చేయడం ఈ సినిమాను విస్తృత ఆడియెన్స్‌కు చేరువ చేసింది. పాన్ ఇండియా స్థాయిలో మిరాయ్ సాధించిన సక్సెస్ కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తెలుగు మాత్రమే కాకుండా ఇతర భాషల్లో విడుదలైన డబ్బింగ్ వెర్షన్స్ మంచి రెస్పాన్స్ తెచ్చుకోవడం, ఈ సినిమాకు ఉన్న యూనివర్సల్ అప్పీల్‌ను చూపిస్తోంది. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో పెరుగుతున్న టాలీవుడ్ సినిమాల ప్రభావంలో మిరాయ్ కూడా కీలక పాత్ర పోషించింది. ఈ క్రమంలో హీరో తేజ సజ్జ బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంటున్నారు. యంగ్ హీరోగా పాన్ ఇండియా బ్రాండ్‌ను నిర్మించుకుంటూ, నార్త్ మార్కెట్‌లో కూడా స్ట్రాంగ్ ప్రెజెన్స్ సాధించడం ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా మారింది. ఇండస్ట్రీ ట్రెండ్ పరంగా చూస్తే, మిరాయ్ విజయం సౌత్ డామినేషన్ నెరేటివ్ ను మరింత బలపరుస్తోంది. క్వాలిటీ కంటెంట్, హై ప్రొడక్షన్ వాల్యూస్ ఉంటే భాషా అడ్డంకులు ఉండవన్న విషయాన్ని ఈ సినిమా మరోసారి నిరూపించింది. అంతేకాకుండా, మల్టీ లాంగ్వేజ్ రిలీజ్ ద్వారా ఇండియన్ సినిమాలు గ్లోబల్ మార్కెట్ వైపు వేగంగా అడుగులు వేస్తున్న దిశలో కూడా మిరాయ్ ఒక ఉదాహరణగా నిలిచింది. ఈ అన్ని విజయాల మధ్య ఇప్పుడు ప్రధానంగా దృష్టి ఆకర్షిస్తున్నది ఫ్రాంచైజ్ బిల్డింగ్. మిరాయ్ ను కేవలం ఒక సినిమాగా కాకుండా, లాంగ్ టర్మ్ ఫ్రాంచైజ్‌గా డెవలప్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు ఇండస్ట్రీలో బలమైన టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే మిరాయ్ పార్ట్2 ప్రీ ప్రొడక్షన్ దశలో ఉండగా, సీక్వెల్‌ను మరింత గ్రాండ్‌గా, విస్తృతమైన యూనివర్స్‌తో తీసుకురావాలనే ఆలోచనలో టీమ్ ఉందని సమాచారం. కథా పరంగా, విజువల్ స్కేల్ పరంగా, అలాగే క్యారెక్టర్ ఎక్స్‌పాన్షన్ పరంగా కూడా మిరాయ్2 మరింత యాంబిషియస్ గా ఉండబోతోందని అంచనాలు పెరుగుతున్నాయి. దీంతో ఇప్పుడందరి దృష్టి మిరాయ్2 పై ఉండగా, ఈ ఫ్రాంచైజ్ ఎంత దూరం వెళ్తుందో అనేది ఆసక్తికరంగా మారింది.

